www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 11 డిసెంబర్ 2022

5

వైఎస్ఆర్

అట్లూరులో అత్యధిక వర్షపాతం

కడప : అట్లూరు మండలంలో అత్యధికంగా 40 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి శనివారం ఉదయం ఎనిమిది గంటల వరకు నమోదైన వర్షపాతం వివరాలు.. కడపలో 28, కమలాపురంలో 23.2, వల్లూరులో 27.0, చెన్నూరులో 19.8, చింతకొమ్మదిన్నె మండలంలో 26.8, పెండ్లిమర్రిలో 30.0, ఖాజీపేటలో 22.4, ఒంటిమిట్టలో 26.8, సిద్ధవటంలో 29.2, బద్వేలులో 26.4, బి.మఠంలో 38.0, శ్రీఅవధూత కాశినాయన మండలంలో 12.2, కలసపాడులో 18.2, పోరుమామిళ్లలో 24.6, బి.కోడూరులో 15.8, గోపవరంలో 23.2, ఎస్. మైదుకూరులో 24.6, జమ్మలమడుగులో 13.4, కొండాపురంలో 7.4, మైలవరంలో 11.8, పెద్దముడియంలో 15.2, రాజుపాలెంలో 11.8 నమోదైంది. ప్రొద్దుటూరులో 16.8, ముద్దనూరులో 10.8, చాపాడులో 19.8, దువ్వూరులో 23.6, ఎర్రగుంట్లలో 17.2, పులివెందులలో 12.8, సింహాద్రిపురంలో 5.6, వర్షపాతం నమోదైంది

మాండూస్ తుఫాన్ జడివాన రూపుదాల్చింది. కడప, అన్నమయ్య జిల్లాల్లో శుక్రవారం మధ్యాహ్నం నుంచి శనివారం సాయంత్రం వరకు ఆకాశానికి చిల్లులు పడిన చందంగా ఏకధాటిగా వర్షం కురుస్తూనే ఉంది. జిల్లాలోని వాగులు, వంకలు, నదులు, సెలయేర్లు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. 24 గంటలుగా కురుస్తున్న వర్షం ధాటికి గోడ కూలిన ఘటనలో మహిళ మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. మాండూస్ తుఫాన్ ధాటికి వాగులు, వంకలు, నదులు ఉప్పొంగుతున్న నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం అధికారులను అప్రమత్తం చేయడంతో ప్రజానీకం ఊపిరిపీల్చుకుంది.

ఖాదరపల్లెలో నేలకొరిగిన వరి పంట

జడివాన

- కడప, అన్నమయ్య జిల్లాల్లో పొంగుతున్న వాగులు
- పెన్నానదికి మూడు వేల క్యూసెక్కుల నీరు విడుదల
- గుంజనేరు, పుల్లంగేరు నదుల విజృంభణ
- లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కడప జిల్లా కేంద్రంలోని లోతట్టు ప్రాంతాల్లో వర్షపునీరు నిల్వలతో నగర జీవనం స్తంభించింది. శుక్రవారం సాయంత్రం నుంచి శనివారం సాయంత్రం వరకు ఏకధాటిగా కురుస్తున్న వర్షం కారణంగా నగర జీవనం స్తంభించింది. నందలూరు మండల కేంద్రంలోని లోతట్టు ప్రాంతాల్లోనికి వరద నీరు చేరడంతో చెరువులను తలపించింది. శనివారం ఉదయం 10 గంటల సమయానికి కడప జిల్లాలో 569 మి.మీ, అన్నమయ్య జిల్లాలో 372.4 మి.మీ వర్షపాతం నమోదైంది. కడప జిల్లాలో అట్లూరులో 40 మి.మీ, దువ్వూరులో 40 మి.మీ చొప్పున అత్య ధిక వర్షపాతం నమోదు కావడం గమనార్హం.

ఉప్పొంగుతున్న వాగులు, వంకలు

మాండూస్ తీరం దాటిన తర్వాత వర్షం తీవ్రరూపం దాల్చింది. ఫలితంగా కడపతో పాటు అన్నమయ్య జిల్లాలోని రైల్వేకోడూరు మండల పరిధిలోని గుంజనేరు, కోడూరు-బాలుపల్లి అటవీ రేంజ్ పరిధిలోని అడవుల్లోని సెలయేర్లు ఉప్పొంగడంతో కడప-తిరుపతి జాతీయ రహదారిపై ఉధృతంగా ప్రవహిస్తోంది. పుల్లంపేట మండలంలోని పుల్లంగేరు నదులు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఒంటిమిట్ట మండలం దర్జిపల్లిలో రేకుటిల్లు కూలిన ఘటనలో కొమ్ము పద్మావతి (50) అనే మహిళ మృతి చెందడం ఆందోళన కలిగించింది.

గండికోట రిజర్వాయర్ ఎగువ భాగాలైన చిత్రావతి, అనంతపురం జిల్లాల నుంచి వచ్చిన వరద నీటి కారణంగా గండికోట రిజర్వాయర్‌లో నాలుగు వేల క్యూసెక్కులు చేరుతోంది. గండికోట రిజర్వాయర్‌లో 26.01 టిఎంసిల మేర పూర్తిస్థాయిలో నీటి నిల్వలు ఉండడంతో వచ్చిన నీటిని వచ్చినట్లు మైలవరం రిజర్వాయర్ మీదుగా పెన్నా నదిలోకి విడుదల చేస్తున్నారు. మైలవరం నుంచి పెన్నానదిలోకి మూడు వేల క్యూ సెక్కులకు మించి నీటిని విడుదల చేశారు. జమ్మలమడుగు-ముద్దనూరు రహదారి కొట్టుకుపోయే అవకాశం ఉంది. ఫలితంగా పెన్నా నదీ పరీవాహక ప్రాంతాల్లోని వరద నీరు వచ్చే అవకాశాలు ఉన్నాయనే ఆందోళన వ్యక్తమవుతోంది.

నేలకొరిగిన పంటలు

జిల్లాలో 600 ఎకరాలకుపైగా పంటలు నేలకొరిగినట్లు తెలుస్తోంది. చాపాడు, కలసపాడు మండలాల్లోని ఖాదరపల్లిలో, 500 ఎకరాల్లో వరి, రాజుపాలెం, మండలంలో 100 ఎకరాల్లో జొన్న పంటలు నేలకొరిగాయి. కడప జిల్లాలో 16 వేల ఎకరాల్లో వరి, అన్నమయ్య జిల్లాలోని మదనపల్లి మండల సమీప ప్రాంతాల్లోని నాలుగు వేల ఎకరాల్లో వరి పంట పొట్టలోకి నీళ్లు చేరే అవకాశాలు ఉన్నాయనే ఆందోళన వ్యక్తమవుతోంది.

నేలకొరిగిన వరి పంట - ఆందోళనలో రైతులు

చాపాడు : ఆరుగాలం కష్టించి పండించిన పంట చేతికొచ్చే సమయంలో మాండూస్ తుపాను రూపంలో నేల పాలవుతోంది. మండల పరిధిలో రెండు రోజు లుగా కురుస్తున్న వర్షానికి వరి చాలా వరకు దెబ్బతినే పరిస్థితి ఏర్ప డింది. మండల వ్యాప్తంగా కెసి, కుందూ, పెన్నా పరిధిలో 16 వేల ఎకరాల్లో రైతులు వరి పంటను సాగు చేశారు. పెన్నా, కుందూ పరివాహక గ్రామాల్లో సాగు చేసిన వరి పంట దాదాపు 4 వేల ఎకరాల్లో నూర్పిడి చేశారు. నూర్పిడి చేసిన వరి ధాన్యం కాపాడుకునే ప్రయత్నంలో రైతులు నిమగ్నమైయ్యారు. రోడ్లు, సురక్షిత ప్రాంతంలో ప్లాస్టిక్ పట్టలు కప్పి వరి ధాన్యం కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. అయ్య వారిపల్లి, తిమ్మాయిపల్లి, రాజువారిపేట, పల్లవోలు, సీతారామపురం, కుచ్చుపాప, రామసుబ్బమ్మ కొట్టాలు, వెదురూరు గ్రామాల పరిధిలో వరి పంట నూర్పిడి దశలో ఉంది. ఖాదర్‌పల్లె, సోమాపురం, అయ్యవారిపల్లి, రామ దాసుపురం, తిమ్మాయిపల్లి గ్రామాల వద్ద వరి పంట అధికంగా నేలకొరిగింది. వరి ధాన్యం వర్షపునీటిలో తడిస్తే మొలకలు వస్తాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. 10 వేల ఎకరాలలో పంట నూర్పిడి దశలో ఉంది. . పండించిన పంట చేతికి వచ్చిన సమయంలో దెబ్బ తింటుంటే ఏమీ చేయలేని పరిస్థితులలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. వర్షంలోనే వరి కోత యంత్రాల ద్వారా నూర్పిడి పనులు చేపడుతున్నారు. ఎకరా సాగుకు రూ.30 వేల వరకు ఖర్చులు అయ్యాయని ప్రస్తుతం వర్షానికి ధాన్యం దిగుబడి తగ్గుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం తగ్గుముఖం పట్టకపోతే పంట పూర్తిగా దెబ్బతింటే ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతాయని పేర్కొన్నారు. ఎకరాకు 32 నుంచి 40 బస్తాల దిగుబడి వస్తున్న సమయంలో వర్షాలతో పంట దెబ్బతినడంతో నష్టాలు తప్పవని అభిప్రాయపడుతున్నారు. గత ఏడాది అధిక వర్షాలతో వరి రైతులు ఇబ్బందులు పడిన విషయం తెలిసిందే. వరుసగా రెండవ ఏడాది కూడా చేతికి వచ్చిన దశలో వర్షం పడుతుండడంతో చెందుతున్నారు. వ్యవసాయ అధికారులు ఆర్‌బికెల పరిధిలో ఉన్న సిబ్బంది దెబ్బతింటున్న పంటల వివరాలను సేకరిస్తున్నారు. ప్రభుత్వం దెబ్బతిన్న పంటలు నమోదుకు అవకాశం ఇచ్చి నష్ట పరిహారం అందివ్వాల్సిన అవసరం ఉంది.

అల్లాడుపల్లె వద్ద రోడ్డు పైన ప్లాస్టిక్ పట్టలు కప్పి ఉంచిన వరి ధాన్యం

ఎడతెరిపిలేని వర్షం

పులివెందుల టౌన్ : తుపాను ప్రభావం వల్ల శుక్రవారం సాయంత్రం నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి రబీలో సాగు చేసిన రైతుల్లో ఆందోళన మొదలైంది. బుడ్డ శనగ, ధనియాలు, మినుము తదితర పంటలు పూత దశలో ఉన్నాయి. ఈ వర్షాల వల్ల పూతలు రాలిపోయి పంట రాక తీవ్రంగా నష్టం జరుగుతుందని రైతుల ఆందోళన చెందుతున్నారు. ఈ వర్షాలు ఇంకా రెండు, మూడు రోజులు పాటు కురిసే అవకాశం ఉండడంతో రైతన్నకు తీరం నష్టం జరిగే ప్రమాదం ఉంది. వరి కోత దశకు చేరడంతో కొంతమంది కోతలు కోసి పొలాలలో ఉంచారు. వర్షం రావడంతో పంట చేతికి రాదన్న ఆందోళనలో మరికొందరు ఉన్నారు. చలికాలం తీవ్రత పెరగడంతో చిన్నారులు, వృద్ధులు అల్లాడుతున్నారు.

పెన్నానదికి 3 వేల క్యూసెక్కుల నీరు విడుదల

జమ్మలమడుగు రూరల్ : మైలవరం నుంచి పెన్నానదికి మూడు వేల క్యూసెక్కుల నీరు విడుదల చేసినట్లు మైలవరం జలాశయం ఎఇఇ గౌతమ్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మాండూస్ తుపాన్ కారణంగా పైభాగం లో వర్షాలు కురవడంతో గండికోట జలాశయానికి వరద నీరు వచ్చాయి. దీంతో మైలవరం జలాశయానికి 3 వేల క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. అక్కడి నుంచి పెన్నాకు 3 వేల క్యూసెక్కుల నీరు వదిలారు. పెన్నా పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ప్రస్తుతానికి గండికోటలో 26.4 టిఎంసిలు, మైలవరంలో 6 టిఎంసిల నీరు నిల్వ ఉంది.

గోడ కూలి మహిళ మృతి

ఒంటిమిట్ట: ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలోని దర్జీపల్లెలో మట్టి గోడ కూలి పద్మావతి (50) అనే గిరిజన మహిళ మృతి చెందారు. శనివారం మధ్యాహ్నం వంట చేసుకుంటున్న సమయంలో పొయ్యి వద్ద ఉన్న గోడ కూలి ఆమెపై పడింది. చుట్టుపక్కలవారు గమనించి ఆమెను వెలికి తీయడంతో అప్పటికే మృతి చెందారు. మృతురాలకు భర్త నాగయ్య, కుమారుడు ఉన్నారు. విషయం తెలుసుకున్న తహశీల్దార్ శ్రీనివాసులురెడ్డి, ఎస్ఐ మధుసూదనరావు ఘటన స్థలానికి చేరుకుని సంఘటనపై ఆరా తీశారు. రాజంపేట ఎంఎల్ఎ మేడా మల్లికార్జునరెడ్డి ఆమె మృతికి సంతాపం తెలియజేస్తూ ఎంపిపి జనార్ధన్‌రెడ్డి ద్వారా రూ.10 వేల ఆర్థిక సాయం చేశారు.

మృతి చెందిన పద్మావతి

సమావేశంలో మాట్లాడుతున్న మనోహర్

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలు

-సిఐటియు 5వ నగర మహాసభలో జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్

ప్రజాశక్తి - కడప అర్బన్

నరేంద్ర మోడీ ప్రభుత్వం పోరాడి సాధించుకున్న భారత కార్మిక హక్కులను, చట్టాలను కాలరాస్తుందని, దీనికి వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధం కావాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ పిలుపునిచ్చారు. శనివారం పాత బస్టాండ్‌లోని సిఐటియు జిల్లా కార్యాలయంలో 5వ నగర మహాసభ నగర అధ్యక్షురాలు బి.లక్ష్మీదేవి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ చట్టానికి తూట్లు పొడుస్తుందని పేర్కొన్నారు. కార్మికుల అశేష త్యాగాలతో, పోరాటాలతో సాధించుకున్న కార్మిక చట్టాలను పెట్టుబడిదారులకు అనుగుణంగా కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని వైసిపి, టిడిపి కుమ్మక్కై సవరణలు చేశాయని విమర్శించారు. ఫలితంగా 44 కేంద్ర కార్మిక చట్టాలను నాలుగు సివిల్ కోడ్స్‌గా మార్చడం వల్ల కార్మికవర్గం బ్రిటీష్ కాలం నుంచి పోరాడి సాధించుకున్న అనేక హక్కులను కోల్పోతున్నారని చెప్పారు. కార్పొరేట్లు ప్రభుత్వాన్ని శాసిస్తుండడంతో కార్మికుల కష్టాలు మరింత పెరుగుతున్నాయని తెలిపారు. పెట్టుబడిదారులకు సబ్సిడీ రుణాలివ్వడం, మరుసటి సంవత్సరం, వాటిని రద్దుచేయడం పరిపాటిగా మారిందని చెప్పారు. ప్రభుత్వ విధానాల వల్ల దేశ చరిత్రలో ఎన్నడూలేని విధంగా పెట్రోల్, డీజిల్, గ్యాస్ తోపాటు నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయని తెలిపారు. విద్య, వైద్య రంగాల ప్రైవేటీకరణ వల్ల పేద, మధ్యతరగతి పిల్లలు చదువుకు దూరమవుతున్నారని చెప్పారు. వైద్యం పేదలకు అందని ద్రాక్షలాగా వున్నదని పేర్కొన్నారు. సిఐటియు జిల్లా కార్యదర్శి రామ్మోహన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాల పేరుతో సంక్షేమ పథకాలు అందిస్తూ మరోవైపు అనేక భారాలు మోపుతోందని వాపోయారు. కుడిచేత్తో ఇచ్చి ఎడమచేత్తో లాగేసుకునేవిధంగా ప్రభుత్వ తీరు ఉందని విమర్శించారు. కార్యక్రమంలో సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి పి. వెంకటసుబ్బయ్య, నాయకులు పి. చంద్రారెడ్డి, గోపి, కేశవ, విజయ్, రవి, స్టీఫెన్, కిరణ్, దీప, వినీల, వెంగమాంబ, మహబూబ్ తార, గోవిందు పాల్గొన్నారు.

మానవ హక్కులపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - కడప అర్బన్

మానవ హక్కులు, వాటి పరిరక్షణపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. శనివారం వైఎస్ఆర్ ఆడిటోరియంలో హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ప్రపంచ మానవ హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హ్యూమన్ రైట్స్ సంస్థ జాతీయ చైర్మన్ తాళ్లూరి ప్రసన్నకుమార్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో కమలాపురం శాసనసభ్యులు పి.రవీంద్రనాథ్ రెడ్డి, మేయర్ సురేష్ పాల్గొని మాట్లాడారు. మానవహక్కుల పరిరక్షణ కోసం సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. సంస్థకు భవిష్యత్తులో తమ వంతు సహాయ సహకారాలు తప్పక అందిస్తామని చెప్పారు. సంస్థ నేషనల్ చైర్మన్ పి.ప్రసన్నకుమార్ మాట్లాడుతూ జిల్లాలో త్వరలో న్యాయ సలహా కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. దేశవ్యాప్తంగా ఐదు వేల మంది చురుకైన సభ్యులతో తమ సంస్థ కార్యకలాపాలను కొనసాగిస్తూ ఉందని చెప్పారు. అనంతరం వివిధ రంగాలలో అత్యుత్తమ సేవలు కనబరిచిన వివిధ సంస్థల వారికి, వ్యక్తులకు అవార్డులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో హజ్ కమిటీ చైర్మన్ గౌస్ లాజం, రాష్ట్ర చేనేత కార్పొరేషన్ చైర్మన్ బడిగింజల విజయలక్ష్మి, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ విక్టర్ డేవిడ్, రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి ఇందిరెడ్డి శంకర్ రెడ్డి, వైసిపి రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్ ఖాన్, వైసిపి రాష్ట్ర యువజన కార్యదర్శి, హ్యూమన్ రైట్స్ సంస్థ నేషనల్ ఉమెన్స్ సెల్ చైర్ పర్సన్ అరుణతార, సౌత్ ఇండియా చైర్మన్ శ్రీకృష్ణ, నేషనల్ వైస్ చైర్మన్ మారే సుకుమార్, రాష్ట్ర అధ్యక్షులు గురుమూర్తి, జిల్లా చైర్మన్ డేవిడ్ కళ్యాణ్ వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన హ్యూమన్ రైట్స్ సభ్యులు వివిధ సంస్థల పాల్గొన్నారు.

ఎంఎల్ఎ, మేయర్‌ను సన్మానిస్తున్న హ్యూమన్ రైట్స్ సభ్యులు

స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి వ్యతిరేకమా ?

- మాండూస్ తుపాన్ కారణంగా ఉక్కు పాదయాత్ర వాయిదా
- ఎంపీ వినయ్ విశ్వం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి - జమ్మలమడుగు

ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డి, జమ్మలమడుగు ఎంఎల్ఎ డాక్టర్ సుధీర్‌రెడ్డి, వైసిపి ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు అనుకూలమా లేక వ్యతిరేకమా చెప్పాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పేర్కొన్నారు. శనివారం ఉదయం జమ్మలమడుగు పట్టణంలోని ఎస్‌వి ఫంక్షన్ హాల్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎంపీ వినయ్ విశ్వం మాట్లాడుతూ కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని అయిన డిమాండ్ చేశారు. తద్వారా నిరుద్యోగ యువకులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆయన చెప్పారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాల్సిన బాధ్యత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని ఆయన అన్నారు. జిల్లాలో ఉక్కు పరిశ్రమ పోరాటాలు కాకుండా ప్రజల ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై కమ్యూనిస్టు పార్టీలు ముందు ఉంటాయని తెలిపారు. ప్రజా సమస్యలపై కమ్యూనిస్టు పార్టీలు నిరంతరమూ పోరాటం చేస్తూనే ఉంటాయని ఆయన అన్నారు. అనంతరం సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ స్థాపన కోసం చేస్తున్న పాదయాత్రను మాండూస్ తుఫాన్ కారణంగా డిసెంబర్ 27కు వాయిదా వేస్తున్నామని ఆయన చెప్పారు. తుపాను కారణంగా నిరాశ్రయులైన ప్రజలను ఆదుకునేందుకు సిపిఐ పార్టీ తరఫున సహాయ సహకారాలు అందించాల్సిన అవసరం ఉంది కనుక పాదయాత్రను తాత్కాలికంగా విరామం ప్రకటిస్తున్నామని ఆయన అన్నారు. ఈనెల 27 నుండి జమ్మలమడుగు పట్టణం నుంచి కడప కలెక్టరేట్ వరకు ఉక్కు పరిశ్రమ స్థాపన పాదయాత్ర ప్రారంభమవుతుందని 30వ తేదీ ముగిస్తుందన్నారు. ప్రభుత్వం ఉక్కు పరిశ్రమ పనులను ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు. ఉక్కు పరిశ్రమ స్థాపన కోసం పాదయాత్ర చేస్తున్న తమకు ఆటంకాలు కలిగించి అనుమతులు నిరాకరించడం సరైంది కాదన్నారు. న్యాయస్థానాలు అనుమతితో ఉక్కు స్థాపన పాదయాత్రను ప్రారంభించాల్సిన పరిస్థితి రావడం నిజంగా దురదృష్టకరమని ఆయన అన్నారు. కడప జిల్లా వాసిగా ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి తండ్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి ఆశయాన్ని నీరుగార్చడం శోచనీయమని చెప్పారు. ఉక్కు పరిశ్రమ నెలకొల్పడం ద్వారా కేవలం కడప జిల్లాలోనే ఉన్న యువతకే కాకుండా కరువు ప్రాంతమైన వెనకబడ్డ ప్రాంతమైన రాయలసీమకు ఎంతో ఉపయోగ ఉంటుందని ఆయన చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఉక్కు పరిశ్రమ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్సీ తెలుగుదేశం పార్టీ నాయకులు దేవగుడి నారాయణరెడ్డి మాట్లాడుతూ ఈనెల 27 నుంచి జరగబోవు పాదయాత్రకు తెలుగుదేశం పార్టీ సంపూర్ణ మద్దతు అందిస్తుందని ఆయన అన్నారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు అచ్చం నాయుడు కూడా పాదయాత్రలో పాల్గొంటారని ఆయన తెలిపారు. సునపురాళ్లపల్లెలో ఉన్న రైతులకు నష్టపరిహారాన్ని అందించాలని ఆయన డిమాండ్ చేశారు. వైసీపీ ప్రభుత్వం మెడలు వంచైనా ఉక్కు పరిశ్రమ స్థాపన చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని ఆయన అన్నారు. రానున్న రోజుల్లో ఉక్కు పరిశ్రమ స్థాపన కోసం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని అన్నారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి సభ్యులు జగదీష్. ఈశ్వరయ్య. సిపిఎం నాయకులు శివ నారాయణ, డివైఎఫ్ఐ కార్యదర్శి శివకుమార్, సిపిఐ నాయకులు ప్రసాద్ పాల్గొన్నారు.

సెప్టిక్ ట్యాంకులో పడి ఇద్దరు చిన్నారులు మృతి

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

మండల పరిధిలోని సాలాబాద్ ఎస్‌సి కాలనీకి చెందిన మంగదొడ్డి హరి, విజయలక్ష్మి దంపతుల కుమార్తె శ్రావ్య (4), కుమారుడు హర్ష (6) శనివారం సెప్టిక్ ట్యాంకులో పడి మృతిచెందారు. ఇద్దరు చిన్నారులు తమ ఇంటి సమీ పంలో ఆడుకోవడానికి వర్షంలో గొడుగుల తీసుకుని బయటకు వెళ్లారు. కొద్ది దూరంలో ఓంటి సమీపంలో మరుగు దొడి కోసం తీసిన గుంతలో పడి పోయారు. వారు ఎంతకూ ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు చుట్టుపక్కల వెతికారు. వారు తీసుకెళ్లిన గొడుగులు రెండు సెప్టిక్ ట్యాంకు వద్ద పడి ఉండడం గమనించారు. వర్షపు నీటితో గుంత నిండిపోవడంతో స్థానికుల సాయంతో అందులో దిగి చూశారు. చిన్నారులిద్దరు ఉండడంతో వారిని వెలికి తీసి వెంటనే కడప రిమ్స్‌కు తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే చనిపోయారని వైద్యులు చెప్పారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి విచారించి కేసు నమోదు చేశారు.

మృతి చెందిన చిన్నారులు హర్ష, శ్రావ్య



మాట్లాడుతున్న కలెక్టర్ విజయ్‌రామరాజు

ఆధునిక ఆలయాలుగా తీర్చిదిద్దుతాం : కలెక్టర్

ఎస్ఎస్ఎ నూతన కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి -కడప

జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలను ఆధునిక ఆలయాలుగా తీర్చిదిద్దుతామని కలెక్టర్ విజయ్‌రామరాజు పేర్కొన్నారు. కడప నగరంలో నూతన హంగులతో ఏర్పాటు చేసిన జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయాన్ని శనివారంఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి ప్రభుత్వ కార్యాలయాలకు నూతన హంగులు, అధునాతన సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయాన్ని నూతన హంగులతో అన్ని రకాల వసతులు కల్పించిన జిల్లా సమగ్ర శిక్ష పథక అధికారి అంబవరం ప్రభాకర్ రెడ్డిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో జెసి సాయికాంత్‌వర్మ, మున్సిపల్ కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్, ట్రైనీ కలెక్టర్ రాహుల్ మీనా జిల్లా సమగ్ర శిక్ష పథక అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్ రెడ్డి, డీఈవో దేవరాజు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ వెంకటసుబ్బయ్య, బద్దెన కళాపీఠం అధ్యక్షులు గంగసాని సాంబశివారెడ్డి , సమగ్ర శిక్ష ఉద్యోగులు పాల్గొన్నారు.

విమర్శనా విపంచి 'కట్టమంచి'

ప్రజాశక్తి-కడప అర్బన్

పింగళి సూ రన కళాపూర్ణోదయంపై 'కవిత్వతత్వ విచారం' అనే తొలి విమర్శ గ్రంథాన్ని రచించిన విమర్శనా విపంచి డాక్టర్ కట్టమంచి రామ లింగారెడ్డి అని సి.పి. బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం బాధ్యులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి పేర్కొన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలోని బ్రౌన్ శాస్త్రి సమావేశ మందిరంలో శనివారం సాయంత్రం బహుముఖ ప్రతి భాశాలి కట్టమంచి రామలింగారెడ్డి 143వ జయంతిని నిర్వహించారు. ముందుగా ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి, భాషా పరిశోధన కేంద్రం సిబ్బంది, పాఠకులు కలసి కట్టమంచి చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులు అర్పించారు. అనంతరం పరిశోధన కేంద్రం బాధ్యులు సాహితీవేత్తగా, పాల నాధక్షుడుగా, రాజకీయవేత్తగా, గొప్పవక్తగా రాణించారని చెప్పారు. కట్టమంచి రామలింగారెడ్డి సి.పి. బ్రౌన్ రచించిన 'హండే అనంతపురం' చరిత్ర ఆధారం చేసుకొని 'ముసలమ్మ మరణం' కావ్యాన్ని రచిం చారని చెప్పారు. సాహిత్య చరిత్రలో తొలి ఆధునిక కావ్యంగా స్థానం సంపాదిం చుకుందని అన్నారు. చిత్తూరు జిల్లా కట్టమంచి గ్రామంలో జన్మించడం వల్ల ఆ పేరుతోనే ప్రసిద్ధులయ్యారని అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయానికి తొలి ఉపాధ్యక్షులుగా పనిచేసి ఉన్నతవిద్యలో అనేక సంస్కరణలను తీసుకువచ్చారని అన్నారు. సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి మాట్లాడుతూ కట్టమంచి చెన్నైలో చదువుకుంటున్నప్పుడు ముసలమ్మ మరణాన్ని రచించారన్నారు.

పొలికేక

ప్రజా'దృష్టి'

జిల్లాలో ఉక్కు ఉద్యమం పొలికేక వేసింది. రాష్ట్ర విభజన హక్కు చట్టంలో ఇచ్చిన హామీ ప్రకారం కడప జిల్లాలో సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాల్సి ఉంది. 2014 నుంచి నేటి వరకు పదేళ్లుగా ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలని కోరుతూ వామపక్షాలు ఆధ్వర్యంలో ప్రజాసంఘాలు పెద్దఎత్తున ఉద్యమాన్ని చేపట్టడం ముదావహం. 2007లో అప్పటి వైఎస్ఆర్ సర్కారు జమ్మలమడుగు నియోజకవర్గ పరిధిలోని చిటిమిటిచింతల సమీపంలో 10,800 ఎకరాల్లో రూ.20 వేల కోట్లతో 30 లక్షల టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో బ్రహ్మణీ యాజమాన్యం ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఉక్కు పరిశ్రమ ప్రకటన మొదలు భూసేకరణ దశ వరకు ప్రతిపక్ష టిడిపి అనేక మెలికలు పెట్టిన సంగతి తెలి సిందే. ప్రతిపక్షంలో ఎవరు ఉన్నా అభివృద్ధి పనులకు అడ్డు పడడం పరిపాటిగా మారడం ఆందోళన కలిగిస్తోంది. అప్పటి సర్కారుకు ఎదురైన అడ్డంకుల్ని లెక్క చేయకుండా ముందుకు సాగడంతో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు దిశగా ముందుకు సాగిపోయింది. అప్పటి ముఖ్య మంత్రి వైఎస్ఆర్ మరణానంతరం బ్రహ్మణీ ఉక్కు పరిశ్రమ కోర్టు కేసులు, ఇతర వ్యవహారాలు చుట్టుముట్టడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా నిలిచిపోయింది. అనంతరం అధికారం చేతు లు మారిన పరిస్థితుల్లో ముఖ్యమంత్రులుగా వచ్చిన రోశయ్య, కిరణ్ కుమార్‌రెడ్డి ఉక్కు పరిశ్రమ ఏర్పాటు అంశాన్ని అటకెక్కించడం జిల్లా వాసుల ఆశలను అడియాశలు చేశారు. 2014 సార్వత్రిక ఎన్నికల్లో కేంద్రంలో ఎన్‌డిఎ, రాష్ట్రంలో టిడిపి అధికారంలో రావడంతో సాంకేతిక అంశాలు, లాభదాయకం కాదనే పేర్లతో మూలన పడేయ డం విస్మయాన్ని కలిగించింది. 2019 సార్వత్రిక ఎన్నికల ముంగిట 20 18 డిసెంబర్ 27న అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జమ్మలమడుగు నియోజకవర్గం మైలవరం మండలం కంబాలదిన్నె సమీపంలో రూ.18 వేల కోట్ల వ్యయంతో 30 లక్షల టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో కూడిన రాయలసీమ స్టీల్ కార్పొరేషన్ పేరుతో శంకు స్థాపన చేయడం తెలిసిందే. 2019 సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి అధికారంలోకి వచ్చింది. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా వైసిపి అధికారంలోకి వచ్చిన మూడున్నరేళ్లలో పరిశ్రమ ఉత్పత్తి ప్రారంభి స్తామని హామీనిచ్చిన సంగతి తెలిసిందే. 2019 డిసెంబర్ 23న ముఖ్యమంత్రి హెూదాలో వైఎస్ జగన్ రూ. 15 వేల కోట్లతో 20 లక్షల టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో జమ్మల మడు గు మండల పరిధిలోని సున్నపురాళ్లపల్లి దగ్గర సేకరించి మూడు వేల ఎకరాల్లో మరోసారి శంకుస్థాపన చేశారు. కానీ పరిశ్రమ ఏర్పా టును విస్మరించడం ఆందోళన కలిగించింది. ఫలితంగా ఉమ్మడి కడప జిల్లా నుంచి ఏటా 33 వేల మంది నుంచి 55 వేల మంది విద్యార్థులు నిరుద్యోగులుగా మిగిలిపోవాల్సి వచ్చింది. జిల్లాలో కరు వు కాటకాల కారణంగా ప్రతియేటా జిల్లా నుంచి 25 వేల మం దికిపైగా నిరుద్యోగులు గల్ఫ్‌దేశాలు, హైదరాబాద్, చెన్నయ్, బెంగ ళూరు, మహారాష్ట్ర వంటి నగరాలకు వలసలు వెళ్తున్న సంగతి తెలిసిందే. ఇటువంటి వలసలను నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రేక్షకపాత్ర పోషించడం విస్మయాన్ని కలిగిస్తోంది. ఈనే పథ్యంలో 2024 సార్వత్రిక ఎన్నికలు తరుముకొస్తున్న నేపథ్యంలో సిపిఐ, సిపిఎం ఆధ్వర్యంలో ప్రజాసంఘాలను కలుపుకుని మరోసారి సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలని, ముఖ్యమంత్రి వైఎస్ కుటుంబానికి రాజకీయ అవకాశాన్ని కల్పించిన జిల్లా ప్రజానీకం రుణం తీర్చుకోవాలని కోరుతూ పాదయాత్రకు శ్రీకారం చుట్టడం గమనార్హం. జమ్మలమడుగు మండలంలోని కన్యతీర్థం నుంచి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ తలపెట్టిన పాదయాత్రకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోవడం విస్మయాన్ని కలిగించింది. పొరుగు రాష్ట్రమైన తెలంగాణ అక్కడి ప్రభుత్వం ప్రజాసమస్యలపై పోరాటం పేరుతో ప్రతిపక్ష పార్టీలకు పాదయాత్ర చేసుకోవడానికి అవకాశం ఇచ్చిన సంగతి తెలిసిందే. కనీసం ఇటువంటి ప్రాప్తకాలజ్ఞతను ప్రదర్శించకపోవడం నియంతృత్వానికి సంకేతంగా నిలుస్తోంది. అధికారం ఎవరికీ శాశ్వతం కాదనే సంగతిని పాలకులు గుర్తుచేసుకుని ప్రజాస్వామిక పాలన సాగించాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ఇటువంటి నియంత పోకడలకు పాల్పడడం సిగ్గుచేటు. 20 17లో సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం కేసరి జిల్లా పరిషత్ కార్యాలయం ఎదుట నిర్వహించిన బహిరంగ సభకు హాజరుతో ఉక్కు ఉద్యమం జాతీయ దృష్టిని ఆకర్షించిన సంగతి తెలిసిందే. ఈనెల 13న కలెక్టరేట్ ఎదుట తలపెట్టిన పాదయాత్ర ముగింపు కార్యక్రమానికి సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా హాజరుతో ఉద్యమం మరోసారి జాతీయస్థాయి దృష్టిని ఆకర్షించడం కొత్త మలుపు తీసుకోనుందని చెప్పవచ్చు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు చిత్తశుద్ధిని కనబరచాల్సిన అవసరం ఎం తైనా ఉందని చెప్పవచ్చు.

- ప్రజాశక్తి - కడపప్రతినిధి

13న మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్

ప్రజాశక్తి - మైదుకూరు

విద్యార్థుల్లో శాస్త్ర, సాంకేతిక విజ్ఞానాన్ని పెంపొందించాలనే ఉద్దేశంతో ఈనెల 13న స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో ఉదయం 10 గంటలకు మండలస్థాయి సైన్స్ పర్యావరణ నమూనా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంఇఒ వర్ధన తెలిపారు. ప్రతి జిల్లా పరిషత్, ఎయిడెడ్, కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయం, ఏపి సాంఘిక సంక్షేమ, ఏపి సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ హైస్కూల్స్ నుండి పర్యావరణహిత నమూనాలు, ఆరోగ్యం-పరిశుభ్రత, సాఫ్ట్‌వేర్, యాప్‌లు, పర్యావరణం, వాతావరణ మార్పులు, గణిత నమూనా అంశాలపై ప్రతి దాని నుండి ఒక విద్యార్థి, ప్రతి హైస్కూల్ నుండి ఐదు మంది విద్యార్థులు ఐదు నమూనాలను తయారు చేసుకుని హాజరుకావాలని సూచించారు. మండలంలోని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొనాలని ఆమె కోరారు.

జెఎన్‌టియు ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పులివెందుల జెఎన్‌టియు కళాశాలలో సిఎస్ఇ ద్వితీయ సంవత్సరం చదువుతున్న రవిచంద్ర మోడ్రన్ సింగింగ్‌లో మొదటి స్థానం, జానపద గేయాల్లో రెండవ స్థానం సాధించారు. కడపలోని కెఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కాలేజీ ఆడిటోరియంలో నిర్వహించిన యువజనోత్సవాల్లో రవిచంద్ర ప్రతిభ చూపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జి.ఎస్.ఎస్.రాజు, వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఆర్.రమణారెడ్డి, సి.ఎస్.ఈ. విభాగాధిపతి డాక్టర్ ఎస్.జెస్సికా సరత, అధ్యాపక సిబ్బంది అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఈనెల 14,15,16 తేదీల్లో కెఎల్ యూనివర్సిటీ తాడేపల్లిలో జరగబోయే రాష్ట్రస్థాయి యువ జనోత్సవాల్లో తమ విద్యార్థి పాల్గొనడానికి అర్హత సాధించాడని హర్షం వ్యక్తం చేశారు.

వర్షంలోనూ సాగిన 'గడప గడపకూ మన ప్రభుత్వం'

మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి

ప్రజాశక్తి - దువ్వూరు

తుపాను ప్రభావంలో కూడా మండలంలోని చల్లబసాయిపల్లె గ్రామంలో శనివారం ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఇంటికెళ్లి నవరత్న పథకాలను వివరించారు. ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా అని ఆయన ప్రజలతో ఆరా తీశారు. ఏవైనా సమస్యలు ఎదురైతే తక్షణమే సంబంధిత అధికారులు వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ సలహాదారులు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, ఎంపిపి కానాల జయచంద్రారెడ్డి, సంగన హరినాథ్ రెడ్డి, ఇరగంరెడ్డి శంకర్‌రెడ్డి, మండల వైసిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

రక్తదానం మరొకరి ప్రాణాన్ని నిలబెడుతుంది

ప్రజాశక్తి - రాయచోటి

రక్తదానం మరొకరి ప్రాణాన్ని నిలబెడుతుందని హెల్పింగ్ హ్యాండ్స్ చైర్మన్ డాక్టర్ సయ్యద్ మైనుద్దీన్ అన్నారు. శనివారం హెల్పింగ్ హ్యాండ్స్ కమిటీ కీలక సభ్యులు మహమ్మద్ జైద్ జన్మదిన సందర్భంగా పట్టణంలో దీపా బ్లడ్ బ్యాంక్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మైనుద్దీన్ మాట్లాడుతూ ఆపదలో ఉండి రక్తం అవసరం ఉన్న వారికి రక్తదానం చేసినప్పుడు కలిగే సంతృప్తి మరెందులోనూ కలగదన్నారు. హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రక్త దాన శిబిరాలు ఏర్పాటు చేసి ప్రాణాపాయ స్థితిలో వారికి రక్తదానం చేస్తామని చెప్పారు. తలసేమియా, గర్భిణులు, ప్రమాదాల్లో గాయపడిన వారు రక్తం కోసం ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రక్తదానం చేయడం వల్ల ఎంతో మంది ప్రాణాలను కాపాడ వచ్చని తెలిపారు. కార్యక్రమంలో కీలక కమిటీ సభ్యులు షాహీల్ మహమ్మద్, సమీర్, ఆసిఫ్, రెహాన్, సన్నీ అబుసమద్, మహమ్మద్, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక ఆర్‌టిసి బస్సు సర్వీసులు

ప్రజాశక్తి-మదనపల్లి అర్బన్

ధనుర్మాసం పురస్కరించుకుని ఆర్టీసీ స్పెషల్ సర్వీసులు నడుపుతున్నామని ప్రయాణికుల కోసం ఇంటి వద్దకే టిక్కెట్లు అందజేస్తామని మదనపల్లె ఆర్టీసీ డిపో-1 మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 17, 24, 31 తేదీలతో పాటు వచ్చే నెల 7న మదనపల్లె నుంచి తరిగొండ లక్ష్మీ నరసింహస్వామి ఆలయం, రాయచోటి వీరభద్రస్వామి ఆలయం, గండి ఆంజనేయస్వామి ఆలయం, కడప వెంకటేశ్వరస్వామి ఆలయం, ఒంటిమిట్ట రామాలయం, నందలూరు సౌమ్యనాథ ఆలయాలకు రానుపోను చార్జీలు రూ.650 చెల్లించాలన్నారు. ఆయా పుణ్య క్షేత్రాలకు భక్తుల కోసం ప్రత్యేక సర్వీసులు నడుపు తున్నామన్నారు. ప్రతి పౌర్ణమికి తిరువణ్ణా మలైకి బస్సు నడుపుతామన్నారు. వివరాలకు డిఎం 9959225676, ఎఎం(టి) 7382875034, టిఐ 7382876638 సంప్రదించాలని కోరారు.

రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - రాజంపేట అర్బన్

పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి అన్నారు. వర్షాలకు అరటి, బొప్పాయి నేలకొరిగిన పంటలను పరిశీలించారు. సచివాలయ పరిధిలోని హార్టికల్చర్ ఉద్యోగులు పంట నష్టపోయిన రైతుల వివరాలను సేకరించాలన్నారు. అనంతరం కలెక్టర్ గిరీషకు ఎమ్మెల్యే ఫోన్ ద్వారా మాట్లాడుతూ రాజంపేట నియోజకవర్గంలో జరిగినటువంటి అరటి, బొప్పాయి పంటల నష్టాలను తెలియజేశారు. కలెక్టర్ స్పందించి వర్షం తగ్గుముఖం పట్టిన వెంటనే సంబంధిత అధికారులను పొలాల దగ్గరకు పంపి రైతులకు జరిగిన పంట నష్ట వివరాలు సేకరిస్తున్నారు. పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని రైతులకు భరోసా ఇచ్చారు.

ముస్లిముల ద్రోహి చంద్రబాబు

ప్రజాశక్తి - వాల్మీకిపురం

రాష్ట్రంలోని ముస్లింలను దగా చేసిన ద్రోహి టిడిపి అధినేత నారా చంద్రబాబు అని పీలేరు నియోజకవర్గ వైసిపి మైనార్టీ నాయకుడు అబ్బుల్ కలీమ్ ఆరోపించారు. గుంటూరు జిల్లా పొన్నూరులో శుక్రవారం ముస్లిం మైనార్టీల సమావేశంలో టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు చేసిన వ్యాఖ్యలు విడ్డూరంగా ఉన్నాయని ఆయన ఖండించారు. శనివారం స్థానిక వైసిపి పార్టీ కార్యాలయంలో మైనార్టీ నాయకులతో కలిసి అబ్బుల్ కలీమ్ మాట్లాడుతూ దుల్హన్, దూకాన్ - మకాన్, విదేశీ విద్య పథకాలు 2017-18లోనే టిడిపి ప్రభుత్వ మంగళం పాడిన చంద్రబాబు ఇప్పుడు ముస్లింల పట్ల మొసలి కన్నీరు కారుస్తున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో వక్ఫ్ ఆస్తులు కూడా ఆక్రమణకు గురైంది చంద్రబాబు హయాంలోనే అని, రాష్ట్రంలో ముస్లిం మైనార్టీల సామాజిక వెనుకబాటుకు కూడా ఆయనే కారకుడన్నారు. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో పీలేరు నియోజకవర్గంలో మాత్రం ఒక టికెట్‌ను మాత్రమే మైనార్టీలకు ఇచ్చినప్పటికీ, ఇక్కడ కూడా మైనార్టీ అభ్యర్థి గెలుపుకు అవకాశమైన వనరులను సమకూర్చకుండా, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి గెలిచిన తర్వాత టిడిపి ఎన్నికల ముందురా కుదుర్చుకున్న ఒప్పందం మేరకు ఒకటికి కొరకన్నా దగా చేసింది చంద్రబాబు నాయుడు కాదా అని ప్రశ్నించారు. అంతేకాకుండా నల్లారి కిషోర్ కుమార్ రెడ్డిని పార్టీలో చేర్చుకునేందుకు పీలేరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహించిన డాక్టర్ ఇక్బాల్ అహ్మద్ ఖాన్‌ను నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పదవి నుంచి తొలగించి ముస్లింలను చంద్రబాబు నాయుడు అవమానపరిచారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఎన్నికల తర్వాత టిడిపి అధికారంలోకి వచ్చినప్పటికీ ఓటమికి గురైన టిడిపి అభ్యర్థి ఇక్బాల్ అహ్మద్ ఖాన్‌కు నామినేటెడ్ పదవిలో న్యాయం చేయకుండా అన్యాయం చేశారని, అదే ఇక్బాల్ అహ్మద్ ఖాన్ వైసీపీలో చేరిన తర్వాత సీఎం జగన్ మోహన్ రెడ్డి కేబినెట్ హోదా గల రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్ వంటి ఉన్నత పదవిని ఇచ్చి గౌరవించారన్నారు.

సంతలో అన్ని సౌకర్యాలు కల్పిస్తాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - మైదుకూరు

మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలో బద్వేలు రోడ్డులోని గగ్గితిప్ప వద్ద ఏర్పాటు చేసిన నూతన సంతలో త్వరలోనే అన్ని సౌకర్యాలు కల్పిస్తామని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి తెలిపారు. గగ్గితిప్ప వద్ద అయిదెకరాల్లో నూతనంగా నిర్మించిన పశువుల సంతను శనివారం కలెక్టర్ విజయ్‌రామరాజు, ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మాండూస్ తుపాను కారణంగా సంత ఆవరణలో రైతులకు కొంత అసౌకర్యం కలిగిందని తెలిపారు. త్వరలోనే అన్ని వసతులు కల్పిస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మూడు నెలల వ్యవధిలో సంత ప్రాంగణంలో సిమెంటు రోడ్డు, రేకుల షెడ్డు ఏర్పాటు చేసి రైతులకు అన్ని వసతులు కల్పిస్తామన్నారు. వర్షం పడుతున్నా లెక్కచేయకుండా సంతకు ప్రజలు రావడం చాలా సంతోషదాయకంగా ఉందన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సాయికాంత్ వర్మ, రాష్ట్ర వ్యవసాయ శాఖ సలహాదారులు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, మైదుకూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ అన్నపురెడ్డి శ్రీమన్నారాయణరెడ్డి, మున్సిపల్ చైర్మన్ మాచునూరు చంద్ర. చాపాడు ఎంపిపి లక్ష్మయ్య, బ్రహ్మంగారిమఠం ఎంపిపి సి.వీరనారాయణరెడ్డి, రామ గోవిందరెడ్డి. జయచంద్రారెడ్డి. మైదుకూరు పట్టణ మహిళ అధ్యక్షురాలు కిరణ్మయి, ఎంపిడిఒ కుళాయమ్మ, వైసిపి నాయకులు, కార్యకర్తలు, రైతులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, అన్ని మండలాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సంతను ప్రారంభిస్తున్న కలెక్టర్ విజయ్‌రామరాజు, ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

కుంటలను తలపిస్తున్న రహదారులు

ఎటుపోలేక రోడ్డుపై నిల్చిన వర్షపు నీరు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

నగర పంచాయితీ పరిధిలోని నాలుగు రోడ్ల కూడలి నుండి సాయిబాబా గుడి మీదుగా పోవు ఎర్రగుడిపాడు రస్తా బురద కుంటగా మారింది. శుక్రవారం సాయంత్రం నుండి కురుస్తున్న వర్షానికి ఆ ప్రాంతం అలా తయారైంది. ఆ దారి నుంచి రాకపోకలు సాగించాలంటే నరకయాతన పడాల్సి వస్తోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 20 ఏళ్ల క్రితం వేసిన సిసి రోడ్డు వేశారు. దీంతో ఆ రోడ్డు మొత్తం గోతులు పడింది. ఈ పరిస్థితుల్లో స్థానికులు గుంతలను మట్టితో చదును చేసుకున్నారు. వర్షంతో చదును చేసిన మట్టి లోతైన గోతులుగా ఏర్పడ్డాయి. నీరు నిలిచి రోజుల తరబడి నిల్వ ఉంటుంది. వాహనాలు చోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతేగాక వాహనాలు వెళ్లే సమయంలో బురద నీరు నివాస ఇళ్లపై పడుతోందని ఆవేదన చెందుతున్నారు. నూతన రోడ్డు వేయాలని పలుమార్లు నగర పంచాయతీ కార్యాలయం చుట్టూ తిరిగినా, స్థానిక నాయకులకు చెప్పినా ఫలితంలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ దారినే విద్యార్థులు, వృద్ధులు, మహిళలు వెళ్లాల్సి ఉంది. నిల్వ ఉన్న నీరు దుర్వాసన వెదజల్లుతోందని, దోమల బెడద తీవ్రంగా ఉందని స్థానికులు హడలిపోతున్నారు. ఇప్పటికైనా తమ సమస్యను పరిష్కరించాలని ప్రజలు అధికారులు, నాయకులను కోరుతున్నారు.

ఆస్పత్రుల చుట్టూ తిరగలేకున్నాం..

వర్షపు నీరు నిల్వ ఉండడంతో స్థానికంగా నివాసం ఉండేవారికి విష జ్వరాలు సోకుతన్నాయి. రోజూ ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నాం. కొత్త సిసి రోడ్లు వేసి, మా సమస్యను తీర్చాలని అధికారులను కోరుతున్నాం.

- కొట్లూరు బాషా, స్థానికుడు

వేంపల్లె : బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో మాండూస్ తుపాన్ వల్ల చలిగాలులతో కూడిన వర్షంతో స్థానికులు అల్లాడుతున్నారు. చలి గాలులతో ప్రజలు వణుకుతున్నారు. వర్షం కురిసే సమయంలో చలితో కూడిన ఈదురు గాలులు పెరగడంతో పిల్లలు, వృద్ధులు అల్లాడు తున్నారు. శనివారం ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. ప్రజలు బయటికి వెళ్లలేక ఇంట్లోనే చాల మంది ఉండిపోయారు. రోడ్లు కూడళ్లు నిర్మానుష్యంగా మారిపోయాయి. రెండో శనివారం కావడంతో ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలకు సెలవుతో అందరూ ఇంటికే పరిమితమయ్యారు.

జమ్మలమడుగు రూరల్ : రెండు రోజుల నుంచి తుపాను వల్ల కురుస్తున్న వర్షాలు, ఈదురు గాలులు ప్రజలను వణికిస్తున్నాయి. శుక్రవారం సాయంత్రం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. శనివారం ఉదయం నుంచి ఈదురు గాలులతో ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. చేతికొచ్చిన వరి పంట నేల మట్టం అవుతుండడంతో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు.

సమస్యలను తెలుసుకునేందుకు కంట్రోల్ రూమ్

చాపాడు : మాండూస్ తుపాను ప్రభావం వల్ల మండలవ్యాప్తంగా శుక్రవారం రాత్రి నుంచి ఎడతెరపిలేని వర్షం కురుస్తోంది. 1.9.8 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు ఇన్‌ఛార్జి ఎఎస్ఒ ప్రమీల తెలిపారు. దువ్వూరు మండలంలో 23.6మి.మీ. వర్షపాతం నమోదైనట్లు తెలిపారు. వర్షంతో ఏవైనా సమస్యలుంటే తెలుసుకునేందుకు తహశీల్దార్ కార్యాలయంలో 8 మంది సిబ్బందితో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. తహశీల్దార్ సుభాని ఆధ్వర్యంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. గ్రామాలలో సచివాలయ సిబ్బందిని అందుబాటులో ఉంచారు.

ఖాదర్‌పల్లెలో నిలిచిన వర్షపునీరు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : తహశీల్దార్

చక్రాయపేట : మండూస్ తుపానుతో కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ రాజా నరేంద్ర సింహ ఒక ప్రకటనలో కోరారు. వెలిగల్లు జలాశయంలో నీరు వచ్చి చేరుతోందని, నీటిని పాపాగ్ని నదిలోకి ఏ క్షణంలోనైనా వదిలే అవకాశం ఉందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని పాపాగ్ని నది పరివాహక గ్రామాల ప్రజలు ఆ ప్రాంతాలకు వెళ్లరాదన్నారు. మండలంలోని అధికారులు, సిబ్బంది కూడా ప్రజలకు అందుబాటులో ఉండాలని కోరారు. తుపాను వల్ల ఎలాంటి ప్రమాదం జరగకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆయన ఆదేశించారు. రెవెన్యూ, పోలీసు, ఎంపిడిఒకు ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలని సూచించారు. పాపాగ్ని నది, చెరువులు, వంకలు వద్దకు పిల్లలను పంపకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలను తహశీల్దార్ కోరారు.

పూర్వ విద్యార్థుల కలయిక ఆనందదాయకం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆనందదాయకమని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. 1983-84 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన అప్పటి విద్యార్థులు స్థానిక పతంగే రామయ్య హైస్కూల్‌లో శనివారం కలిశారు. వారు చదివిన స్కూల్లోనే అపూర్వ సమ్మేళనం గాండ్ల శ్రీనివాసులు నేతృత్వంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వివిధ ప్రాంతాల్లో, వివిధ హోదాల్లో ఉంటూ 38 సంవత్సరాల తర్వాత అందరూ కలసి తమ గురువులకు సన్మానం చేసి ఆశీర్వాదం పొందడం అపూర్వం.. అందరికీ ఆచరణీయమన్నారు. తమ స్నేహితులతో కలసి చిన్ననాటి జ్ఞాపకాలు మళ్లీ పొందాలని ఉందన్నారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో మిమ్మల్నందరిని కలిసి సమయం గడపడం ఆనందంగా ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అనంతరం ఉపాధ్యాయులు జయ తిమ్మారెడ్డి, శేషారెడ్డి, శ్యామసుందరరావు, జాన్, ఆర్.శివారెడ్డి మాట్లాడుతూ మీరు మాకు ఇప్పటికీ పిల్లల్లాగే కనిపిస్తున్నారని తెలిపారు. క్రమశిక్షణతో ఖాళీ సమయంలో అనేక పుస్తకాలు చదివి, ఆ జ్ఞానాన్ని మీ పిల్లలకు, వాళ్ల పిల్లలకు అందించండని వారు ఆశీర్వదించారు. నాటి ఉపాధ్యాయులు శేషారెడ్డి, రసూల్, శ్యామసుందరరావు, జయ తిమ్మారెడ్డి, చందూ సుబ్రమణ్యం, ఆర్.తిమ్మారెడ్డి, ఇందిరమ్మ, మస్తాన్‌బీ, అత్తరున్నీసా, ప్రమీలమ్మ, పద్మావతి, మీనా కుమారితోపాటు నాటి అటెండర్ ఉషేనిని ఘనంగా సన్మానించారు. దివంగత నాటి ఉపాధ్యాయులు ఐ.లక్ష్మినారాయణ, గాండ్ల పుల్లయ్య, కమాల్ సాహెబ్, బి.రామకృష్ణారెడ్డి కుటుంబాలను సన్మానించారు. దివంగత మిత్రులు జనార్ధన్, సుబ్బన్నకు అశ్రు నివాళి అర్పిస్తూ ఆయా కుటుంబాలను సన్మానించారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, గురువులతో పూర్వ విద్యార్థులు

ఘనంగా ముందస్తు క్రిస్మస్ వేడుకలు

మార్బుల్ శీనును సన్మానిస్తున్న పాస్టర్లు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

స్థానిక జాన్స్ హైస్కూల్‌లో జీసస్ పాస్టర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించినట్లు ఎపి ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ మార్బుల్ శీను తెలిపారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ జీసస్ జన్మదినాన్ని పురస్కరించుకొని చేసే క్రిస్మస్ వేడుకలను ముందస్తుగా జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. వచ్చే ఏడాదంతా ప్రజలు సుఖ సంతోషాలతో ఆరోగ్యంగా జీవించాలని ఆయన ఆకాంక్షించారు. 50 మంది పాస్టర్లకు దుస్తులను వితరణ చేశారు. జీసస్ పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.అగస్టిన్ రాజు, సెక్రటరీ ప్రభుదానం, జిజె సైమన్, సంతోష బాబు మార్బుల్ శీనును అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మంగదొడ్డి సింగరయ్య, పాస్టర్లు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎపిఎండిసి కార్మికుల నిరసన

ప్రజాశక్తి - ఓబులవారిపల్లి

మంగంపేట బెరైటీస్‌లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్, ట్రైనీ కార్మికులు జోరు వర్షంలోనూ శనివారం 19వ రోజు తమ నిరసనను కొనసాగించారు. పరిపాలనా భవనం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఎపిఎండిసి ఎండితో పోరాట కమిటీ అడ్వైసర్లు సిహెచ్ చంద్రశేఖర్‌రెడ్డి, సిహెచ్.చంద్రశేఖర్, డిశ్రీనివాసులు, సిహెచ్.శంకరయ్య చర్చలు జరిపారు. చర్చలనతరం వారు మాట్లాడుతూ 535 మంది కార్మికులకు సమానపనికి సమాన వేతనం ఫిబ్రవరి 4వ తేదీ నుండి ప్రతి ఒక్కరికీ ఇవ్వాలని ఎండిని కోరామన్నారు. గతంలో యంటిఎ 1, యంటిఎ 2 ఇవ్వడం అన్యాయమని ఇప్పుడైనా సమాన పనికి సమాన వేతనం 12(3) అగ్రిమెంట్ ప్రకారం సక్రమంగా ప్రతి ఒక్క కార్మికుడికి అమలు చేయాలని డిమాండ్ చేశామన్నారు. ఎండి స్పందిస్తూ 15 రోజుల సమయం ఇస్తే అందరికీ న్యాయం చేస్తామని చెప్పారన్నారు. పోరాట కమిటీ నాయకులు మీరు న్యాయం చేసేంత వరకు ఉద్యమం కొనసాగుతుందని తేల్చి చెప్పారు. 15 రోజులలో సమస్య పరిష్కరించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేసి సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. పోరాట కమిటీ కన్వీనర్ ఆర్.వెంకటేష్ మాట్లడుతూ ఎండి హామీ మేరకు ప్రస్తుతం సమ్మె చేయటం లేదని మామూలుగా భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమాలు సమస్య పరిష్కారం అయ్యేంత వరకు నినాదాలతో నిరసన వ్యక్తం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎపిఎండిసి వర్కర్స్ యూనియన్ జనరల్ సెక్రెటరీ బండారు భాస్కర్, ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ జనరల్ సెక్రెటరీ నారదాసు సుబ్బరాయుడు, కో-కన్వీనర్ అరుణావతి, ట్రెజరర్ ఈశ్వరయ్య, నాయకులు చంద్రశేఖర్, మణి, దానమయ్య, ప్రతాప్, పెంచలయ్య, సి.ధనలక్ష్మీ, పి.రమణయ్య, పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

మెడికల్ కిట్లు అందజేత

ప్రజాశక్తి - గాలివీడు

మండలం నుంచి శబరిమల బస్సు యాత్రకు బయలుదేరుతున్న అయ్యప్ప భక్తులకు ప్రయాణంలో ఆరోగ్య సురక్షిత కోసం మెడికల్ కిట్లను అమీన్ మెడికల్ స్టోర్ వారి సహకారంతో మైనార్టీ నాయకులు కె.కె. ఖాదర్‌మొహిద్దీన్, సుధాకర్‌రెడ్డి శనివారం అందజేశారు కార్యక్రమంలో శ్రీరామ జ్యువెలర్స్ రామాంజులు, కిరణ్, మైనార్టీ యువ నాయకులు ఎస్.కె నిజాముద్దీన్, జైద్, శంకర్ నాయుడు, బాబు, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

పంట పొలాల్లో నీటిని తొలగించుకోవాలి

ప్రజాశక్తి - చాపాడు

తుపాను తాకిడికి వరి పంట పొలాల్లో నీరు అధికంగా చేరుతుందని, వర్షం తగ్గగానే అధిక నీటిని రైతులు బయటకు పంపే ఏర్పాట్లు చేసుకోవాలని వ్యవసాయ అధికారి మ్యాగీ తెలిపారు. తుపాను తీవ్రత తగ్గే వరకు వరి పంట నూర్పిడి పనులు విరమించుకోవాలని ఆమె సూచించారు. పంట నూర్పిడికి సిద్ధంగా ఉన్న వరి పంట అక్కడక్కడా నేలకొరుగుతుందన్నారు. రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వర్షానికి పంటలు దెబ్బతిన్న పంటలను సిబ్బంది ద్వారా గుర్తించి నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామని తెలిపారు.

హరిత ఫౌండేషన్‌కు సమాజ సేవ పురస్కారం

ప్రజాశక్తి - దువ్వూరు

సన్మానం అందుకుంటున్న కదిరి సంజీవరాయుడు

సమాజసేవా కార్యక్రమాలకు గుర్తింపుగా దువ్వూరు మండలం నేలటూరు గ్రామానికి చెందిన కెఎస్ఆర్ హరిత ఫౌండేషన్ చైర్మన్ కదిరి సంజీవ రాయుడు యాదవ్ పురస్కారం అందుకున్నారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం పురస్కరించుకొని నెల్లూరు పట్టణంలోని రావు బహుదూర్ రేబాల లక్ష్మీ నరసారెడ్డి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనను సన్మానించారు. వివిధ రంగాల్లో సేవలందించిన వారిని గుర్తించి సమాజసేవ పురస్కారం అందించారు. నెల్లూరు జిల్లా పరిషత్ చైర్మన్ ఆనం అరుణ, నగర మేయర్ స్రవంతి జయవర్ధన్, వరల్డ్ హ్యూమన్ రైట్స్ జాతీయ చైర్మన్ మొరంరెడ్డి సుబ్బారెడ్డి, కడప అసోసియేషన్ ఫర్ సర్వీస్ సొసైటీ జిల్లా కన్వీనర్ డాక్టర్ చిత్తా రవిప్రకాష్‌రెడ్డి సమాజ సేవ పురస్కారం-2022 అందించారు.

సిబిఐటి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - చాపాడు

జెఎన్‌టియు అనంతపురం వారు విడుదల చేసిన ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరం రెండవ సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో స్థానిక సిబిఐటి కళాశాలకు విద్యార్థులు మంచి ప్రతిభ కనబరచి ఉత్తమ ఫలితాలు సాధించారు. ఇందులో సి.యస్.ఇ.విభాగానికి పి.గౌతమి 91.98శాతం, యస్.సలీం 90.83, యం.పద్మావతి 89.28, ఇ.సి.ఇ.విభాగానికి చెందిన కె.దివ్యాంజలి 85.81, యన్.సుష్మ 85.48, యం.శ్రీవాణి 85.05, ఇ.ఇ.ఇ.విభాగానికి చెందిన డి.శ్రీవల్లి, సుష్మిత 86.88శాతం, పి.సాయి దీపక్ 86.56, ఎ.పెంచలయ్య 86.56, సివిల్ విభాగానికి చెందిన యం.నవనీశ్వర్‌రెడ్డి 85.83, జి. రేవతి 84.30, సి.సూర్య నారాయణ 83.65శాతం మార్కులు సాధించారు. అలాగే ఎంబిఎ రెండవ సెమిస్టర్ ఫలితాల్లో వి.ప్రదీప్ 77, డి.మౌనిక 76.25, జి.దీక్షిత74.25శాతం మార్కులతో ఉత్తమ ఫలితాలు సాధించారని కళాశాల కరెస్పాండంట్ డాక్టర్ వి.జయచంద్రారెడ్డి, డైరెక్టర్ వి.లోహిత్‌రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాసులరెడ్డి ఇతర అధ్యాపక, అధ్యాపకేతర బృందం హర్షం వ్యక్తం చేశారు.

18న జిల్లా స్థాయి చెకుముకి పరీక్ష

ప్రజాశక్తి- మదనపల్లి అర్బన్

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చెకుముకి పరీక్ష ఈ నెల 18వ తేదీన నిర్వహిస్తున్నట్లు జెవివి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కరుణాకర్, ప్రకాష్‌రెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. తుపాన్ కారణంగా జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో శనివారం జరగాల్సిన జిల్లా స్థాయి పరీక్షను 18వ తేదీకు వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులలో శాస్త్రీయ ఆలోచన దృక్పథాన్ని పెంపొందించడానికి చెకుముకి పరీక్షను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలు అన్ని మండలాల్లో పరీక్షను నిర్వహించి వారిలో ప్రథమ స్థానం పొందిన విద్యార్థులకు జిల్లా స్థాయి పరీక్ష నిర్వహిస్తున్నామని తెలిపారు.

మదనపల్లె డిప్యూటీ తహశీల్దార్ సస్పెన్షన్

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

మదనపల్లె మండల ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ భువనేశ్వరిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ గిరీష శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం, సెలవులో వెళ్లినందుకు ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటరు నమోదు, జాబితా రూపకల్పనలో నిబంధనల ప్రకారం వ్యవహరించకపోవడం వల్ల భువనేశ్వరిదేవిని సస్పెండ్ చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నిత్యాన్నదాన భవనానికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి - వాల్మీకిపురం

సేవా కార్యక్రమాలతోనే సంతృప్తి లభిస్తుందని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. పీలేరుకు చెందిన విఎస్ఆర్ కల్యాణ మండపం అధినేత విజయశేఖర్ రెడ్డి స్థానిక సాయి నారాయణసేవ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్య అన్నదాన భవన నిర్మాణానికి రూ.లక్ష చెక్కును విరాళంగా ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి చేతులమీదుగా ట్రస్టుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జగన్మోహన్ రెడ్డి, చలపతి, నరసింహారెడ్డి, చింతల ఆనంద రెడ్డి, చింతల శివానంద రెడ్డి, కేశవ రెడ్డి పాల్గొన్నారు.

బహుదా నుంచి 400 క్యూసెక్కుల నీరు విడుదల

నిమ్మనపల్లి : మండల పరిధిలోని బహుదా ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిండడంతో నీటిని విడుదల చేసినట్లు ఎఇ శ్రీహరిరెడ్డి తెలిపారు. విస్తారంగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని చెరువులు, కుంటలతో పాటు బహుదా నీటి ప్రాజెక్టు కూడా పూర్తి స్థాయిలో నిండిందన్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 2015 అడుగులు, 0.4 టిఎంసిలు కాగా ప్రస్తుతం 2014 అడుగుల వరకు నీరు ఉన్నట్లు తెలిపారు. ప్రాజెక్టు నుంచి రెండు గేటుల ద్వారా 400 క్యూసెక్కుల నీటిని విడుదల చేసామన్నారు. ఎగువున కురుస్తున్న వర్షాలతో ప్రస్తుతం 70 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టు వచ్చి చేరుతుండగా 400 క్యూసెక్కుల నీటిని బయటకు పంపుతున్నామన్నారు.

పూలతోట్లలో నీరు... రూ.లక్షల్లో నష్టం

వాల్మీకిపురం: శుక్రవారం రాత్రి నుంచి మాండూస్ తుపాన్ ప్రభావం చూపడంతో జనం అవస్థలు పడుతున్నారు. చలిగాలులతో ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. పట్టణంలో దుకాణాలన్ని మూతపడ్డాయి. రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. పూలతోట్లల్లో నీరు చేరి నష్టం వాటిల్లడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలిగినా తమకు సమాచారం అందించాలని ఎస్ఐ బిందుమాధవి సూచించారు. తహశీల్దార్ ఫిరోజ్ ఖాన్ మాట్లాడుతూ విఆర్ఒలు ఆయా పంచాయతీల్లో అందుబాటులో ఉండి, ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఒక వేళ ఏదైనా ప్రమాదం సంభవిస్తే వెంటనే స్పందించాలని సూచించారు. పశువులు, గొర్రెలు, మేకల కాపరులు చెట్ల కింద ఉండకూడదని సూచించారు. మండల వ్యాప్తంగా ఉన్న పూలతోటలు, తదితర పంట రైతులకు నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

వేలం పాటలో రూ.5.97 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - బి.కొత్తకోట

వాహనాల వేలంపాటలో ప్రభుత్వానికి రూ.5,97699 లు ఆదాయం వచ్చినట్లు ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. ఎస్పి హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు మదనపల్లి డిఎస్పి కేశప్ప , సిఐ శివాంజనేయులు పర్యవేక్షణలో వివిధ కేసులో పట్టుబడిన 15 వాహనాలను శనివారం ఉదయం 12 గంటలకు పోలీస్ స్టేషన్‌ప్రాంగణంలో వేలంపాటను నిర్వహించినట్లుఎస్.ఐ.రామ్మోహన్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ13 ద్విచక్రవాహనాలు, ఒకకారు, ఆటోకు వేలంపాట నిర్వహించినట్లు తెలిపారు. వాహన వేలం పాటలో 5,97,699 రూపాయలు ప్రభుత్వానికి ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ రవీంద్రనాయక్, నాగరాజుగౌడ్, కానిస్టేబుల్ నాగేంద్ర, నరసింహులు, లక్ష్మీనారాయణ, వెంకటరమణ, కావ్య, అంబ్రిష్ పోలీసులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

లక్కిరెడ్డిపల్లి : మాండూస్ తుపానుతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రంగారెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత మూడు రోజులుగా రాష్ట్రమంతా కురుస్తున్న తుఫాన్ ప్రభావంతో మామిడి, వేరశనగ, టమోటా ఇతర పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. వర్షానికి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఎకరాకు పది లక్షల రూపాయలు నష్టపరిహారం ఆదుకోవాలని కోరారు.

వర్షంలోనూ నిరసన తెలుపుతున్న ఎపిఎండిసి కార్మికులు

వర్ష బీభత్సం

మాండూస్ తుపానుతో జిల్లాలో కుండపోతగా వర్షం కురుస్తోంది. కుండపోత వర్షంతో జిల్లా జనజీవనం స్తంభించిపోయింది. రైతుల ఆశల పంట దెబ్బతింది. శుక్రవారం మధ్యాహ్నం నుంచి కురుస్తున్న భారీ వర్షం కారణంగా లోతట్టు ప్రాంతాలన్నీ నీటమునిగాయి. భారీ వర్షం కారణంగా జిల్లాలోని వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. జిల్లాలోని చిన్న తరహా ప్రాజెక్టులకు పెద్దఎత్తున నీరు చేరుతున్నాయి. వేలాది క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. జిల్లా అధికార యంత్రాంగం ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా వాగులు, వంకలు, చెరువుల దగ్గర పెద్దఎత్తున పోలీసులను మోహరించింది. రెండు రోజుల ముందు నుంచే తుపాన్ ప్రభావం ఉంటుందని తెలియడంతో అధికారులు కలెక్టర్ కమాండ్ కంట్రోల్ రూమ్‌తో పాటు రాయచోటి, రాజంపేట, మదనపల్లెల్లో కంట్రోల్ రూములను ఏర్పాటు చేశారు. భారీ వర్షాలు జిల్లా వ్యాప్తంగా అధిక ప్రభావం చూపాయి.

- ప్రజాశక్తి జిల్లా యంత్రాంగం

- ఎడతెరిపిలేని వర్షంతో స్తంభించిన జనజీవనం
- నేలకొరిగిన వ్యవసాయ, ఉద్యాన పంటలు
- తీవ్రమైన చలిగాలులు
- జనావాసాలు, లోతట్టు ప్రాంతాలు జలమయం

రాయచోటి : కంచాలమ్మ చెరువును పరిశీలిస్తున్న కలెక్టర్ గిరీష

రాజంపేట : నేలకొరిగిన అరటి పంటలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మేడా

రాయచోటి : మాండూస్ తుపాన్ ప్రభావంతో శుక్రవారం మధ్యాహ్నం నుంచి వర్షాలు కురుస్తుండడంతో జిల్లా ప్రజలు వణికిపోతున్నారు. వరి, టమోటా, అరటి, కంది. జిల్లా వ్యాప్తంగా 2,67,9111 ఎకరాలలో రైతులు పంట సాగు చేశారు. తుపాను ప్రభావంతో నష్టం తప్పడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో మరో రెండు రోజుల పాటు భారీగా కురుస్తాయని అధికారులు చెబుతున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తుపానుగా మారి అన్నమయ్య జిల్లాపై తీవ్ర ప్రభావం చూపుతోంది ఎడతెరపి లేని వర్షం కారణంగా చలి తీవ్రత అధికమైంది. శుక్రవారం మధ్యాహ్నం నుంచి జల్లులు ప్రారంభం అయ్యాయి. ఈదురుగాలు పెరగడంతో ప్రజలు వణికిపోతున్నారు. వృద్ధులు, చిన్న పిల్లలు చలి గాలులకు అల్లాడుతున్నారు. ఉష్ణోగ్రతలు పగటి ఉష్ణోగ్రతలు 37 డిగ్రీల నుంచి 26 డిగ్రీలకు తగ్గింది. రాత్రి వేళ కనిష్ట ఉష్ణోగ్రత 23 డిగ్రీలకు తగ్గింది . మాండూస్ తుపాను దెబ్బతో రైల్వేకోడూరు, రాజంపేట, రాయచోటి, మదనపల్లె, పీలేరుతో పాటు వివిధ ప్రాంతాల్లో ఒక మోస్తరుగా వర్షం కురిసింది. తుపాను తీరం దాటే ముందు, తరువాత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలియడంతో జిల్లా అధికారి యంత్రాంగం అప్రమత్తం అయ్యారు. గాలులు, వర్షాలు ప్రారంభం కావడంతో తీర ప్రాంతంలో రైతులు ఆందోళనలో చెందుతున్నారు. ఇప్పటికే వరి కోసి కుప్పలుగా పొలాల్లో ఉంచిన వారు సైతం నష్టపోతామని భయపడుతున్నారు. జిల్లాలో 11,000 హెక్టార్లలో వరి సాగైంది 6 వేల హెక్టార్లలో కుప్పలు వేశారు. మరో ఐదు వేల హెక్టార్లు వివిధ దశలో ఉన్నాయి. శనివారానికి మరో 50 హెక్టార్ల పంట నష్టం వాటిల్లినట్లు సమాచారం. ఇప్పటికే తేమశాతం ఎక్కువగా ఉందని మిల్లర్లు కొనుగోలు చేయడానికి ముందుకు రావడం లేదని రైతులు వాపోతున్నారు. వర్షానికి తడిసిన వరిని కోసేందుకు మరికొంత సమయం అవసరమని చెబుతున్నారు. గాలులకు మామిడి మొక్కలు, టమోటా, మునగ పంటలు ఎక్కడ నాశనమవుతాయోనని ఆందోళన చెందుతున్నారు. జిల్లా కేంద్రంలో ఇప్పటికే కలెక్టర్ గిరీష కంచాలమ్మ గండిని సందర్శించారు. మాండవ్యది ఒడ్డున ఉన్న చెత్తా చెదారాన్ని జెసిబి సాయంతో తొలగిస్తున్నారు. కలెక్టర్, ఎస్పీ, విద్యుత్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు అప్రమత్తంగా ఉన్నారు. జిల్లాలో రాజంపేట, రాయచోటి, మదనపల్లెలో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. జిల్లాలో ఎక్కడైనా సంఘటన చోటు చేసుకుంటే వెంటనే కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలని అధికారులు పేర్కొంటున్నారు.

బహుదా నుంచి 400 క్యూసెక్కుల నీరు విడుదల

నిమ్మలనపల్లె : బహుదా జలాయశం నుంచి దిగువకు విడుదల చేసిన నీరు

నిమ్మనపల్లి : మండల పరిధిలోని బహుదా ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిండడంతో నీటిని విడుదల చేసినట్లు ఎఇ శ్రీహరిరెడ్డి తెలిపారు. విస్తారంగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని చెరువులు, కుంటలతో పాటు బహుదా నీటి ప్రాజెక్టు కూడా పూర్తి స్థాయిలో నిండిందన్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 2015 అడుగులు, 0.4 టిఎంసిలు కాగా ప్రస్తుతం 2014 అడుగుల వరకు నీరు ఉన్నట్లు తెలిపారు. ప్రాజెక్టు నుంచి రెండు గేటుల ద్వారా 400 క్యూసెక్కుల నీటిని విడుదల చేసామన్నారు. ఎగువున కురుస్తున్న వర్షాలతో ప్రస్తుతం 70 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టు వచ్చి చేరుతుండగా 400 క్యూసెక్కుల నీటిని బయటకు పంపుతున్నామన్నారు.

పూలతోట్లలో నీరు... రూ.లక్షల్లో నష్టం

వాల్మీకిపురం: శుక్రవారం రాత్రి నుంచి మాండూస్ తుపాన్ ప్రభావం చూపడంతో జనం అవస్థలు పడుతున్నారు. చలిగాలులతో ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. పట్టణంలో దుకాణాలన్ని మూతపడ్డాయి. రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. పూలతోట్లల్లో నీరు చేరి నష్టం వాటిల్లడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలిగినా తమకు సమాచారం అందించాలని ఎస్ఐ బిందుమాధవి సూచించారు. తహశీల్దార్ ఫిరోజ్ ఖాన్ మాట్లాడుతూ విఆర్ఒలు ఆయా పంచాయతీల్లో అందుబాటులో ఉండి, ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఒక వేళ ఏదైనా ప్రమాదం సంభవిస్తే వెంటనే స్పందించాలని సూచించారు. పశువులు, గొర్రెలు, మేకల కాపరులు చెట్ల కింద ఉండకూడదని సూచించారు. మండల వ్యాప్తంగా ఉన్న పూలతోటలు, తదితర పంట రైతులకు నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది: ఎమ్మెల్యే

రాజంపేట అర్బన్ : పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి అన్నారు. వర్షాలకు అరటి, బొప్పాయి నేలకొరిగిన పంటలను పరిశీలించారు. సచివాలయ పరిధిలోని హార్టికల్చర్ ఉద్యోగులు పంట నష్టపోయిన రైతుల వివరాలను సేకరించాలన్నారు. అనంతరం కలెక్టర్ గిరీషకు ఎమ్మెల్యే ఫోన్ ద్వారా మాట్లాడుతూ రాజంపేట నియోజకవర్గంలో జరిగినటువంటి అరటి, బొప్పాయి పంటల నష్టాలను తెలియజేశారు. కలెక్టర్ స్పందించి వర్షం తగ్గుముఖం పట్టిన వెంటనే సంబంధిత అధికారులను పొలాల దగ్గరకు పంపి రైతులకు జరిగిన పంట నష్ట వివరాలు సేకరిస్తారన్నారు. పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని రైతులకు భరోసా ఇచ్చారు.

వాల్మీకిపురం : దెబ్బతిన్న చామంతి తోట వద్ద రైతు నరసింహులు

రాయచోటి : మాండవ్య నది వద్ద పోలీస్, రెవెన్యూ అధికారుల బందోబస్తు

పెద్దమడ్యంలో నేలకొరిగిన భారీ వృక్షం

కొనసాగుతున్న ఎపిఎండిసి కార్మికుల నిరసన

ప్రజాశక్తి - ఓబులవారిపల్లి

మంగంపేట బెరైటీస్‌లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్, ట్రైనీ కార్మికులు జోరు వర్షంలోనూ శనివారం 19వ రోజు తమ నిరసనను కొనసాగించారు. పరిపాలనా భవనం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఎపిఎండిసి ఎండితో పోరాట కమిటీ అడ్వైసర్లు సిహెచ్ చంద్రశేఖర్‌రెడ్డి, సిహెచ్.చంద్రశేఖర్, డిశ్రీనివాసులు, సిహెచ్. శంకరయ్య చర్చలు జరిపారు. చర్చలనతరం వారు మాట్లాడుతూ 535 మంది కార్మికులకు సమానపనికి సమాన వేతనం ఫిబ్రవరి 4వ తేదీ నుండి ప్రతి ఒక్కరికీ ఇవ్వాలని ఎండిని కోరామన్నారు. గతంలో యంటిఎ 1, యంటిఎ 2 ఇవ్వడం అన్యాయమని ఇప్పుడైనా సమాన పనికి సమాన వేతనం 12(3) అగ్రిమెంట్ ప్రకారం సక్రమంగా ప్రతి ఒక్క కార్మికుడికి అమలు చేయాలని డిమాండ్ చేశామన్నారు. ఎండి స్పందిస్తూ 15 రోజుల సమయం ఇస్తే అందరికీ న్యాయం చేస్తామని చెప్పారన్నారు. పోరాట కమిటీ నాయకులు మీరు న్యాయం చేసేంత వరకు ఉద్యమం కొనసాగుతుందని తేల్చి చెప్పారు. 15 రోజులలో సమస్య పరిష్కరించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేసి సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. పోరాట కమిటీ కన్వీనర్ ఆర్.వెంకటేష్ మాట్లడుతూ ఎండి హామీ మేరకు ప్రస్తుతం సమ్మె చేయటం లేదని మామూలుగా భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమాలు సమస్య పరిష్కారం అయ్యేంత వరకు నినాదాలతో నిరసన వ్యక్తం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎపిఎండిసి వర్కర్స్ యూనియన్ జనరల్ సెక్రెటరీ బండారు భాస్కర్, ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ జనరల్ సెక్రెటరీ నారదాసు సుబ్బరాయుడు, కో-కన్వీనర్ అరుణావతి, ట్రెజరర్ ఈశ్వరయ్య, నాయకులు చంద్రశేఖర్, మణి, దానమయ్య, ప్రతాప్, పెంచలయ్య, సి.ధనలక్ష్మీ, పి.రమణయ్య, పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి వ్యతిరేకమా?

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

- మాండూస్ తుపాన్ కారణంగా ఉక్కు పాదయాత్ర వాయిదా
- ఎంపీ వినయ్ విశ్వం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి - జమ్మలమడుగు

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి, జమ్మలమడుగు ఎంఎల్ఎ డాక్టర్ సుధీర్‌రెడ్డి, వైసిపి ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు అనుకూలమా లేక వ్యతిరేకమా చెప్పాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పేర్కొన్నారు. శనివారం ఉదయం జమ్మలమడుగు పట్టణంలోని ఎస్‌వి ఫంక్షన్ హాల్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎంపీ వినయ్ విశ్వం మాట్లాడుతూ కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని అయిన డిమాండ్ చేశారు. తద్వారా నిరుద్యోగ యువకులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆయన చెప్పారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాల్సిన బాధ్యత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని ఆయన అన్నారు. జిల్లాలో ఉక్కు పరిశ్రమ పోరాటాలు కాకుండా ప్రజల ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై కమ్యూనిస్టు పార్టీలు ముందు ఉంటాయని తెలిపారు. ప్రజా సమస్యలపై కమ్యూనిస్టు పార్టీలు నిరంతరమూ పోరాటం చేస్తూనే ఉంటాయని ఆయన అన్నారు. అనంతరం సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ స్థాపన కోసం చేస్తున్న పాదయాత్రను మాండూస్ తుఫాన్ కారణంగా డిసెంబర్ 27కు వాయిదా వేస్తున్నామని ఆయన చెప్పారు. తుపాను కారణంగా నిరాశ్రయులైన ప్రజలను ఆదుకునేందుకు సిపిఐ పార్టీ తరఫున సహాయ సహకారాలు అందించాల్సిన అవసరం ఉంది కనుక పాదయాత్రను తాత్కాలికంగా విరామం ప్రకటిస్తున్నామని ఆయన అన్నారు. ఈనెల 27 నుండి జమ్మలమడుగు పట్టణం నుంచి కడప కలెక్టరేట్ వరకు ఉక్కు పరిశ్రమ స్థాపన పాదయాత్ర ప్రారంభ మవుతుందని 30వ తేదీ ముగిస్తుందన్నారు. ప్రభుత్వం ఉక్కు పరిశ్రమ పనులను ప్రారంభిం చాలని డిమాండ్ చేశారు. ఉక్కు పరిశ్రమ స్థాపన కోసం పాదయాత్ర చేస్తున్న తమకు ఆటంకాలు కలిగించి అనుమతులు నిరాకరించడం సరైంది కాదన్నారు. న్యాయస్థానాలు అనుమతితో ఉక్కు స్థాపన పాదయాత్రను ప్రారంభించాల్సిన పరిస్థితి రావడం నిజంగా దురదృష్టకరమన్నారు. కడప జిల్లా వాసిగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి తండ్రి రాజశేఖర్‌రెడ్డి ఆశయాన్ని నీరుగార్చడం శోచనీయమని చెప్పారు. ఉక్కు పరిశ్రమ నెలకొల్పడం ద్వారా కేవలం కడప జిల్లాలోనే ఉన్న యువతకే కాకుండా కరువు ప్రాంతమైన వెనకబడ్డ ప్రాంతమైన రాయలసీమకు ఎంతో ఉపయోగ ఉంటుందని చెప్పారు. ప్రభుత్వం ఉక్కు పరిశ్రమ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్సీ తెలుగుదేశం పార్టీ నాయకులు దేవగుడి నారా యణరెడ్డి మాట్లాడుతూ ఈనెల 27 నుంచి జరగబోవు పాదయాత్రకు తెలుగుదేశం పార్టీ సంపూర్ణ మద్దతు అందిస్తుందని ఆయన అన్నారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు అచ్చం నాయుడు కూడా పాదయాత్రలో పాల్గొంటారని తెలిపారు. సునపు రాళ్లపల్లెలో ఉన్న రైతులకు నష్టపరిహారాన్ని అందించాలని డిమాండ్ చేశారు. వైసీపీ ప్రభుత్వం మెడలు వంచైనా ఉక్కు పరిశ్రమ స్థాపన చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని ఆయన అన్నారు. రానున్న రోజుల్లో ఉక్కు పరిశ్రమ స్థాపన కోసం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని అన్నారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి సభ్యులు జగదీష్. ఈశ్వరయ్య. సిపిఎం నాయ కులు శివనారాయణ, డివైఎఫ్ఐ కార్యదర్శి శివకుమార్, సిపిఐ నాయకులు ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రత్యేక ఆర్‌టిసి బస్సు సర్వీసులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ధనుర్మాసం పురస్కరించుకుని ఆర్టీసీ స్పెషల్ సర్వీసులు నడుపుతున్నామని ప్రయాణికుల కోసం ఇంటి వద్దకే టిక్కెట్లు అందజేస్తామని మదనపల్లె ఆర్టీసీ డిపో-1 మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 17, 24, 31 తేదీలతో పాటు వచ్చే నెల 7న మదనపల్లె నుంచి తరిగొండ లక్ష్మి నరసింహస్వామి ఆలయం, రాయచోటి వీరభద్రస్వామి ఆలయం, గండి ఆంజనేయస్వామి ఆలయం, కడప వెంకటేశ్వరస్వామి ఆలయం, ఒంటిమిట్ట రామాలయం, నందలూరు సౌమ్యనాథ ఆలయాలకు రానుపోను చార్జీలు రూ.650 చెల్లించాలన్నారు. అయ్యప్ప మాలాధారులు కోసం శబరిమలైకు ప్రత్యేక సర్వీసులు నడుపు తున్నామన్నారు. ప్రతి పౌర్ణమికి తిరువణ్ణా మలైకి బస్సు నడుపుతామన్నారు. వివరాలకు డిఎం 99599225676, ఎఎం(టీ) 7382875034, టిఐ 7382876638 సంప్రదించాలని కోరారు.

ఎమ్మెల్యే చింతలకు చెక్కును అందజేస్తున్న దాత విజయశేఖర్‌రెడ్డి

నిత్యాన్నదాన భవనానికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి-వాల్మీకిపురం

సేవా కార్యక్రమాలతోనే సంతృప్తి లభిస్తుందని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. పీలేరుకు చెందిన వివిఎస్ఆర్ కల్యాణ మండపం అధినేత విజయశేఖర్ రెడ్డి స్థానిక సాయి నారాయణసేవ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్య అన్నదాన భవన నిర్మాణానికి రూ.లక్ష చెక్కును విరాళంగా ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి చేతులమీదుగా ట్రస్టుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జగన్మోహన్ రెడ్డి, చలపతి, నరసింహారెడ్డి, చింతల ఆనంద రెడ్డి, చింతల శివానంద రెడ్డి, కేశవ రెడ్డి పాల్గొన్నారు.

18న జిల్లా స్థాయి చెకుముకి పరీక్ష

ప్రజాశక్తి- మదనపల్లి అర్బన్

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చెకుముకి పరీక్ష ఈ నెల 18వ తేదీన నిర్వహిస్తున్నట్లు జెవివి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కరుణాకర్, ప్రకాష్‌రెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. తుపాన్ కారణంగా జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో శనివారం జరగాల్సిన జిల్లా స్థాయి పరీక్షను 18వ తేదీకు వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులలో శాస్త్రీయ ఆలోచన దృక్పథాన్ని పెంపొందించడానికి చెకుముకి పరీక్షను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలు అన్ని మండలాల్లో పరీక్షను నిర్వహించి వారిలో ప్రథమ స్థానం పొందిన విద్యార్థులకు జిల్లా స్థాయి పరీక్ష నిర్వహిస్తున్నామని తెలిపారు.

మదనపల్లె డిప్యూటీ తహశీల్దార్ సస్పెన్షన్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె మండల ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ భువనేశ్వరిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ గిరీష శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం, సెలవులో వెళ్లినందుకు ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటరు నమోదు, జాబితా రూపకల్పనలో నిబంధనల ప్రకారం వ్యవహరించకపోవడం వల్ల భువనేశ్వరిదేవిని సస్పెండ్ చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మెడికల్ కిట్లు అందజేత

ప్రజాశక్తి గాలివీడు

మండలం నుంచి శబరిమల బస్సు యాత్రకు బయలుదేరుతున్న అయ్యప్ప భక్తులకు ప్రయాణంలో ఆరోగ్య సురక్షిత కోసం మెడికల్ కిట్లను అమీన్ మెడికల్ స్టోర్ వారి సహకారంతో మైనార్టీ నాయకులు కె.కె. ఖాదర్‌మొహిద్దీన్, సుధాకర్‌రెడ్డి శనివారం అందజేశారు కార్యక్రమంలో శ్రీరామ జ్యువెలర్స్ రామాంజులు, కిరణ్, మైనార్టీ యువ నాయకులు ఎస్.కె నిజాముద్దీన్, జైద్, శంకర్ నాయుడు, బాబు, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

రక్తదానం మరొకరి ప్రాణాన్ని నిలబెడుతుంది

ప్రజాశక్తి - రాయచోటి

రక్తదానం మరొకరి ప్రాణాన్ని నిలబెడుతుందని హెల్పింగ్ హాండ్స్ చైర్మన్ డాక్టర్ సయ్యద్ మైనుద్దీన్ అన్నారు. శనివారం హెల్పింగ్ హాండ్స్ కమిటీ కీలక సభ్యులు మహమ్మద్ జైద్ జన్మదిన సందర్భంగా పట్టణంలో దీపా బ్లడ్ బ్యాంక్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా మైనుద్దీన్ మాట్లాడుతూ ఆపదలో ఉండి రక్తం అవసరం ఉన్న వారికి రక్తదానం చేసినప్పుడు కలిగే సంతృప్తి మరెందులోనూ కలగదన్నారు. హెల్పింగ్ హాండ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రక్త దానం శిబిరాన్ని ఏర్పాటు చేసి ప్రాణాపాయ స్థితిలో వారికి దానం చేస్తామని చెప్పారు. తలసేమియా, గర్భిణులు, ప్రమాదాల్లో గాయపడిన వారు రక్తం కోసం ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రక్తదానం చేయడం వల్ల ఎంతో మంది ప్రాణాలను కాపడ వచ్చని తెలిపారు. కార్యక్రమంలో కీలక కమిటీ సభ్యులు షాహీల్ మహమ్మద్, సమీర్, ఆసిఫ్, రెహాన్, సన్నీ అబుసమద్, మహమ్మద్, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

ముస్లిముల ద్రోహి చంద్రబాబు

ప్రజాశక్తి-వాల్మీకిపురం

రాష్ట్రంలోని ముస్లింలను దగా చేసిన ద్రోహి టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడని పీలేరు నియోజకవర్గ వైసిపి మైనార్టీ నాయకుడు అబ్దుల్ కలీమ్ ఆరోపించారు. గుంటూరు జిల్లా పొన్నూరులో శుక్రవారం ముస్లిం మైనార్టీల సమావేశంలో చంద్రబాబు నాయుడు చేసిన వ్యాఖ్యలు దెయ్యాలు వేదాలు పలికిన చందంగా ఉన్నాయని విమర్శించారు. శనివారం స్థానిక వైసిపి పార్టీ కార్యాలయంలో మైనార్టీ నాయకులతో కలసి అబ్దుల్ కలీమ్ మాట్లాడుతూ దుల్హన్, దుకాన్-మకాన్, విదేశీ విద్య పథకాలకు 2017-18లోనే టిడిపి ప్రభుత్వం మంగళం పాడిన చంద్రబాబు నాయుడు ఇప్పుడు ముస్లింల పట్ల మొసలి కన్నీరు కారుస్తున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో వక్ఫ్ ఆస్తులు కూడా అన్యాక్రాంతమైంది చంద్రబాబు హయాంలోనేనని, రాష్ట్రంలో ముస్లిం మైనార్టీల సామాజిక వెనుకబాటుకు కూడా చంద్రబాబు నాయుడు కారకుడన్నారు. గత ఎన్నికల తర్వాత టిడిపి అధికారంలోకి వచ్చినప్పటికీ ఓటమికి గురైన టిడిపి అభ్యర్థి ఇక్బాల్ అహ్మద్ ఖాన్‌కు నామినేటెడ్ పదవితో న్యాయం చేయకుండా అన్యాయం చేశారని తెలిపారు. సమావేశంలో నాయకులు చికెన్ మస్తాన్, సైఫుల్లా, ఉమ్మర్ సాహెబ్, సమీవుల్లా, ఇమ్రాన్ పాల్గొన్నారు.

రికార్డులు పరిశీలిస్తున్న డిఎస్‌పి కేశప్ప

పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన డిఎస్‌పి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

బి.కొత్తకోట పోలీస్‌స్టేషన్‌ను శనివారం మదనపల్లి డివిజన్ డిఎస్‌పి కేశప్ప తనిఖీ చేశారు. స్టేషన్ లోని పలు రికార్డులను పరిశీలించి, పెండింగ్ కేసులను త్వరతగతిన పరిష్కరించాలని సూచించారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని, వాహనదారులు అవగాహన కల్పించి ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా పోలీసులు పనిచేయాలన్నారు. ఎస్.ఐ.రామ్మోహన్ స్వతహాగా స్టేషన్‌ను సుందరీకరణ చేయడంతో డిఎస్‌పి అభినందించారు. డిఎస్‌పి వెంట సిఐ శివాంజనేయులు, ఎస్‌ఐ రామ్మోహన్, హెడ్ కానిస్టేబుళ్లు రవీందర్ నాయక్, నాగరాజు గౌడ్, కానిస్టేబుల్ నాగేంద్ర, కావ్య, నరసింహులు, వెంకటరమణ,అంబ్రిష్, లక్ష్మీనారాయణ ఉన్నారు.

హిమాయతుల్లా మృతి పార్టీకి తీరని లోటు

ప్రజాశక్తి -కలికిరి

టిడిపి మైనారిటి నాయకుడు హిమాయతుల్లా మృతి పార్టీకి తీరని లోటు అని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి అన్నారు. మసీదు వీధికి చెందిన హిమాయత్తుల్లా శనివారం ఉదయం గుండె పోటుతో హఠన్మరణం చెందాడు. విషయం తెలుసుకున్న కిషోర్ కుమార్‌రెడ్డి మృతుని ఇంటికి చేరుకుని మృతదేహానికి పూలమాలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో నాయకులు నల్లారి లక్ష్మీకర్‌రెడ్డి, చంద్రారెడ్డి, మాజీ జెడ్‌పిటిసి రహంతుల్లా, నిజాముద్దీన్, నాయకులు లేపాక్షి అస్లాం, ముస్తఫా హజరత్, అఫ్రోజ్, రెడ్డెప్పరెడ్డి, మోహన, కార్యకర్తలు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి- లక్కిరెడ్డిపల్లి

మాండూస్ తుపానుతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రంగారెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత మూడు రోజులుగా రాష్ట్రమంతా కురుస్తున్న తుఫాన్ ప్రభావంతో మామిడి, వేరశనగ, టమోటా ఇతర పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. వర్షానికి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఎకరాకు పది లక్షల రూపాయలు నష్టపరిహారం ఆదుకోవాలని కోరారు. రబీ సీజన్లో వేరుశనగ , ప్రత్యామ్నాయ పంటలు సాగు చేశారని అన్నారు. దెబ్బతిన్న పంటలను రెవెన్యూ అధికారులతో సర్వే చేసి నష్టపోయిన రైతులకు పరిహారం అందివ్వాలని అన్నారు. గత ఏడాది తుఫానుతో దెబ్బతిన్న రైతులకు ఇంకా ఆర్థికసాయం అందలేదని తెలిపారు. మాండూస్ తుఫాన్‌తో నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

ప్రజలకు అండగా నిలుద్దాం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

నియోజకవర్గంలో తుపాను ప్రభావిత ప్రాంత ప్రజలకు అండగా నిలిచి సహాయ, సహకారాలు అందిద్దామని నియోజకవర్గ టిడిపి నాయకులు శ్రీరామనేని జయరామనాయుడు నాయకులకు పిలుపునిచ్చారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం, మాండూస్ తుఫాను రాయలసీమపై పెను ప్రభావం చూప నుందని, దీనిని దృష్టిలో ఉంచుకొని లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రత్తలు పాటిం చాలన్నారు. లోతట్టు ప్రాంత ప్రజలకు అండగా ఉండేందుకు టిడిపి నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు ఎటువంటి సహాయం కావాలన్నా తనను సంప్రదించవచ్చని తెలిపారు.

భూహక్కు పత్రాలను పంపిణీ చేస్తున్న సర్పంచ్, ఎంపిటిసి

భూ హక్కు పత్రాలు పంపిణీ

ప్రజాశక్తి-పెద్దమండ్యం

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న భూహక్కు పత్రాల డిజిటల్ పాసు బుక్కులను పంపిణీ కార్యక్రమాన్ని అధికారులు శనివారం శివపురం గ్రామంలో నిర్వహించారు. కార్యక్రమానికి సర్పంచ్ గంగులమ్మ, ఎంపిటిసి రుక్మాంగద రెడ్డి పాల్గొని రైతులకు జగనన్న భూ శాశ్వత హక్కు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూసమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టారని తెలిపారు. కార్యక్రమంలో విఆర్‌ఒ రామకృష్ణ, సర్వేయర్లు, వైసిపి నాయకులునరసింహులు, రెడ్డెప్ప, నాగరాజు, రైతులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

సెల్ ఫోన్ అప్పగిస్తున్న డిపో మేనేజర్ బండ్లకుమార్

నిజాయితీ చాటుకున్న ఆర్‌టిసి కండక్టరు

పీలేరు : పీలేరు ఆర్‌టిసి డిపోకు చెందిన కండక్టరు తనకు దొరికిన సెల్ ఫోన్‌ను తిరిగి దాని యజమానికి అప్పగించి నిజాయితీ చాటుకున్నారు. పీలేరు మండలం ఆకులవారిపల్లికి చెందిన డి.శివ శుక్రవారం రాత్రి బాకరాపేట నుండి పీలేరుకు బస్సులో వచ్చి స్థానిక బస్టాండులో దిగి, మూత్ర విసర్జన కోసం అక్కడి మరుగుదొడ్డికి వెళ్ళాడు. తన మొబైల్ ఫోన్ అక్కడ పోగొట్టుకుని ఇంటికి వెళ్లిపోయాడు. అదే సమయంలో స్థానిక ఆర్‌టిసి డిపోకు చెందిన కండక్టర్ వి. రామయ్య డ్యూటీ దిగి పోతూ మూత్ర విసర్జన కోసం మరుగుదొడ్డికి వెళ్లారు. అక్కడ అతనికి మొబైల్ ఫోన్ దొరికింది. కొంత చేపటి తర్వాత శివ ఆ నెంబరుకు కాల్ చేసి ఆ ఫోన్ తనదని కండక్టరుకు చెప్పాడు. అతను ఆ ఫోన్ తన దగ్గరే ఉంటుందని, వచ్చి తీసుకు వెళ్ళాలని చెప్పాడు. శనివారం స్థానిక బస్టాండులో ఆర్టీసి డిపో మేనేజరు బండ్ల కుమార్, కంట్రోలర్ సత్యనారాయణ, బుక్ స్టాల్ పసుపులేటి రమణ, కండక్టర్ ప్రసాద్ సమక్షంలో కండక్టర్ రామయ్య ఫోన్ యజమాని శివ భార్య డి.అంజమ్మకు అప్పగించారు. కండక్టర్ రామయ్య నిజాయితీని డిపో మేనేజర్, ప్రయాణికులు అభినందించారు.

హరిత ఫౌండేషన్‌కు సమాజ సేవ పురస్కారం

దువ్వూరు : సమాజసేవా కార్యక్రమాలకు గుర్తింపుగా దువ్వూరు మండలం నేలటూరు గ్రామానికి చెందిన కెఎస్ఆర్ హరిత ఫౌండేషన్ చైర్మన్ కదిరి సంజీవ రాయుడు యాదవ్ పురస్కారం అందుకున్నారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం పురస్కరించుకొని నెల్లూరు పట్టణంలోని రావు బహుదూర్ రేబాల లక్ష్మీ నరసారెడ్డి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనను సన్మానించారు. వివిధ రంగాల్లో సేవలందించిన వారిని గుర్తించి సమాజసేవ పురస్కారం అందించారు.

వణికిస్తున్న 'మాండూస్'

చెరువును తలపిస్తున్న బస్టాండు కూడలి

జలమయమైన రోడ్లు

ప్రజాశక్తి-నందలూరు

మాండుస్ తుఫాన్ ప్రభావంతో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండల కేంద్రంలోని రోడ్లు చెరువులు, కాలవలను తలపిస్తున్నాయి. శుక్రవారం ఉదయం 8 గంటల నుండి శనివారం ఉదయం 8 గంటల వరకు 64 మిల్లీమీటర్ల వర్షపాతం నమోద యింది.ప్రజలు అత్యవసర పనులు ఉంటే తప్ప బయటకు వెళ్లకుండా ఇళ్లలోనే తలదాచుకుంటున్నారు. అత్యవసర పనులు ఉన్నవారు తగు జాగ్రత్తలతో ఇతర గ్రామాలకు వెళుతున్నారు. వర్షాలతో గ్రామ వీధులలో నీరు నిలచి చెరువులను తలపిస్తుండటంతో వాహనదారులు ఇబ్బం దులను ఎదుర్కొంటున్నారు. రైతులు ముందుచూపుతో వరి నాట్లను కాస్త ఆలస్యంగా వేసుకోవడంతో తుఫాను వల్ల పెద్దగా నష్టం సంభవించక పోవచ్చని అంచనాలో ఉన్నారు. తుఫాన్ తీరం దాటినప్పటికీ ఇంకా రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని, వాతావరణశాఖ నిపుణులు సూచిస్తున్నారు. జిల్లా కలెక్టర్ గిరీష, జిల్లాలోని అధికారులను అప్రమత్తం చేసి ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజులు ప్రజలు ఇబ్బందులు పడకుండా వారి వారి ఇండ్లలోనే ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

జలపాతాన్ని తలపిస్తున్న వరద నీరు

ప్రజాశక్తి- రైల్వేకోడూరు

రైల్వే కోడూరు మండలంలోని బాలుపల్లె, కుక్కలదొడ్డి మార్గమధ్యలో గల ప్రధాన రహదారి ప్రక్కన వర్షపు నీరు జలపాతాన్ని తలపిస్తోంది.. బాలుపల్లె అడవులలో కురిసిన భారీ వర్షా నికి వరదనీరు ప్రధాన రహదారిపై ప్రవ హిస్తో ంది. ఈమార్గంలో వెళ్లే ప్రయాణికులు వాహనాలు ఆపి మరీ జలపా తాన్ని సందర్శించి కనువిందు చేస్తున్నారు. నవంబరు, డిసెంబర్ నెలలలో కురిసే భారీ వర్షాలకు ప్రధాన రహ దారిపై వరదనీరు ప్రవహించి రాక పోకలకు అంతరాయం కలు గుతుందని, వరదనీరు రోడ్డుపై ప్రవహించ కుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


అడవుల నుంచి వస్తున్న వరద నీరు

స్తంభించిన జనజీవనం

ప్రజాశక్తి-పెద్దమండ్యం

మాండూస్ తుఫాన్ కారణంగా భారీ వర్షాలు కురు స్తుండటంతో జనజీవనం స్తం భించి పోయింది. రోజు పను లకు వెళ్లే కూలీలు తుఫాన్ కార ణంగా రెండు రోజులు నుండి ఇళ్లకే పరి మితం అయ్య మని అంటున్నారు. ఒకవైపు వాహ నాలు నడుపుకునే వారు కూడా ఇళ్లకే పయి మితం అయ్యమని అన్నారు. మండలం లోని పలు ప్రాంతా లల్లో చెరువులు, కుంటలు నిండి పొంగి పొర్లుతు న్నాయి. మరోవైపు రోడ్లు ధ్వంసం, చెట్లు నెలకు ఒరిగాయి. కొన్ని ప్రాంతాలలో చేతికి వస్తున్న వరి మడులు నీట మునిగాయి. కరెంట్ కోతలు అప్పుడప్పుడు ఉన్నాయి. వరి పంటలను కోసేందుకు మిషన్ రావాలంటే దాదాపు గంటకు 5 వేలు వరకు ఇవ్వవవలసి వస్తుందని రైతులు వాపోతున్నారు. కొందరు యంత్రాల కొరత సృష్టించి అధిక మొత్తంలో దోచుకొంటున్నారని రైతులు వాపోతున్నారు. కుప్పలు వేసిన వరి గడ్డి తడిసి ముద్దయిందని ఇలాగే మరో రొండు రోజు భారీ వర్షాలు వస్తే పంటలు నష్టం, జన జీవన అతలాకుతలం కాక తప్పదని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇంతక మునుపు ఎన్ని తుఫాన్లు వచ్చిన ఇంతటి ఈదురు గాలులు, చలి లేదని ఈ తుఫాన్ తో చలితో పిల్లలు, వృద్దులు అల్లాడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న పుల్లంగేరు

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల కేంద్రంలోని పుల్లంగేరు మాండూస్ తుపాను ప్రభావంతో ఉధృతంగా ప్రవహిస్తోంది. శుక్రవారం నుంచి నిరంతరాయంగా కురుస్తున్న తుపాను ప్రభావంతో ఎగువ ప్రాంతంలో పడిన వర్షాభావం వల్ల పుల్లంగేరు ఉద్ధృతం దాల్చింది. లోతట్టు ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని అధికారులు సూచించారు. చుట్టుపక్కల గ్రామ ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో సంచరించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. తుఫాన్ మరో 24 గంటలు ఉండటంతో ప్రజలందరూ ఇళ్లలోనే ఉండాలని అధికారులు చెబుతున్నారు. ఉప్పొంగుతున్న పుల్లంగేరును చూడడానికి చుట్టుపక్కల గ్రామ ప్రజలు తండోపతండాలుగా తరలివచ్చారు.

పుల్లంగేరు నదిలో ప్రవహిస్తున్న నీరు

పూర్వ విద్యార్థుల కలయిక ఆనందదాయకం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆనందదాయకమని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. 1983-84 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన అప్పటి విద్యార్థులు స్థానిక పతంగే రామయ్య హైస్కూల్‌లో శనివారం కలిశారు. వారు చదివిన స్కూల్లోనే అపూర్వ సమ్మేళనం గాండ్ల శ్రీని వాసులు నేతృత్వంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వివిధ ప్రాంతాల్లో, వివిధ హోదాల్లో ఉంటూ 38 సంవత్సరాల తర్వాత అందరూ కలసి తమ గురువులకు సన్మానం చేసి ఆశీర్వాదం పొందడం అపూర్వం.. అందరికీ ఆచరణీయమన్నారు. తమ స్నేహితులతో కలసి చిన్ననాటి జ్ఞాపకాలు మళ్లీ పొందాలని ఉందన్నారు. ఈ ఆత్మీయ సమ్మే ళనంలో మిమ్మల్నందరిని కలిసి సమయం గడపడం ఆనందంగా ఉందని ఎమ్మెల్యే పేర్కొ న్నారు. అనంతరం ఉపాధ్యాయులు జయ తిమ్మారెడ్డి, శేషారెడ్డి, శ్యామ సుందరరావు, జాన్, ఆర్.శివారెడ్డి మాట్లాడుతూ మీరు మాకు ఇప్పటికీ పిల్లల్లాగే కనిపిస్తున్నారని తెలిపారు. క్రమశిక్షణతో ఖాళీ సమయంలో అనేక పుస్తకాలు చదివి, ఆ జ్ఞానాన్ని మీ పిల్లలకు, వాళ్ల పిల్లలకు అందిం చండని వారు ఆశీర్వదించారు. నాటి ఉపా ధ్యాయులు శేషారెడ్డి, రసూల్, శ్యామసుందరరావు, జయ తిమ్మారెడ్డి, చందూ సుబ్రమణ్యం, ఆర్.తిమ్మారెడ్డి, ఇందిరమ్మ, మస్తాన్‌బీ, అత్తరున్నీసా, ప్రమీలమ్మ, పద్మావతి, మీనా కుమారితోపాటు నాటి అటెండర్ ఉష్మేనిని ఘనంగా సన్మానించారు. దివంగత నాటి ఉపాధ్యాయులు ఐ.లక్ష్మినారాయణ, గాండ్ల పుల్లయ్య, కమాల్ సాహెబ్, బి.రామకృష్ణారెడ్డి కుటుంబాలను సన్మానించారు. దివంగత మిత్రులు జనార్ధన్, సుబ్బన్నకు అశ్రు నివాళి అర్పిస్తూ ఆయా కుటుంబాలను సన్మానించారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, గురువులతో పూర్వ విద్యార్థులు

ఘనంగా ముందస్తు క్రిస్మస్ వేడుకలు

మార్బుల్ శీనును సన్మానిస్తున్న పాస్టర్లు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

స్థానిక జాన్స్ హైస్కూల్‌లో జీసస్ పాస్టర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించినట్లు ఎపి ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ మార్బుల్ శీను తెలిపారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ జీసస్ జన్మదినాన్ని పురస్కరించుకొని చేసే క్రిస్మస్ వేడుకలను ముందస్తుగా జరుపకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. వచ్చే ఏడాదంతా ప్రజలు సుఖ సంతోషాలతో ఆరోగ్యంగా జీవించాలని ఆయన ఆకాంక్షించారు. 50 మంది పాస్టర్లకు దుస్తులను వితరణ చేశారు. జీసస్ పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.అగస్టిన్ రాజు, సెక్రటరీ ప్రభుదానం, జిజె సైమన్, సంతోష బాబు మార్బుల్ శీనును అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మంగదొడ్డి సింగరయ్య, పాస్టర్లు పాల్గొన్నారు.

సంతలో అన్ని సౌకర్యాలు కల్పిస్తాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - మైదుకూరు

మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలో బద్వేలు రోడ్డులోని గగ్గితిప్ప వద్ద ఏర్పాటు చేసిన నూతన సంతలో త్వరలోనే అన్ని సౌకర్యాలు కల్పిస్తామని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి తెలిపారు. గగ్గితిప్ప వద్ద అయిదెకరాల్లో నూతనంగా నిర్మించిన పశువుల సంతను శనివారం కలెక్టర్ విజయ్‌రామరాజు, ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మాండూస్ తుపాను కారణంగా సంత ఆవరణలో రైతులకు కొంత అసౌకర్యం కలిగిందని తెలిపారు. త్వరలోనే అన్ని వసతులు కల్పిస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మూడు నెలల వ్యవధిలో సంత ప్రాంగణంలో సిమెంటు రోడ్డు, రేకుల షెడ్డు ఏర్పాటు చేసి రైతులకు అన్ని వసతులు కల్పిస్తామన్నారు. వర్షం పడుతున్నా లెక్కచేయకుండా సంతకు ప్రజలు రావడం చాలా సంతోషదాయకంగా ఉందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సాయికాంత్ వర్మ, రాష్ట్ర వ్యవసాయ శాఖ సలహాదారులు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, మైదుకూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ అన్నపురెడ్డి శ్రీమన్నారాయణరెడ్డి, మున్సిపల్ చైర్మన్ మాచునూరు చంద్ర. చాపాడు ఎంపిపి లక్ష్మయ్య, బ్రహ్మంగారిమఠం ఎంపిపి సి.వీరనారాయణరెడ్డి, రామ గోవిందరెడ్డి. జయచంద్రారెడ్డి. మైదుకూరు పట్టణ మహిళ అధ్యక్షురాలు కిరణ్మయి, ఎంపిడిఒ కుళాయమ్మ, వైసిపి నాయకులు, కార్యకర్తలు, రైతులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, అన్ని మండలాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సంతను ప్రారంభిస్తున్న కలెక్టర్ విజయ్‌రామరాజు, ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

13న మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్

ప్రజాశక్తి - మైదుకూరు

విద్యార్థుల్లో శాస్త్ర, సాంకేతిక విజ్ఞానాన్ని పెంపొందించాలనే ఉద్దేశంతో ఈనెల 13న స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఉదయం 10 గంటలకు మండలస్థాయి సైన్సు పర్యావరణ నమూనా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంఇఒ పద్మలత తెలిపారు. ప్రతి జిల్లా పరిషత్, ఎయిడెడ్. కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయం, ఎపి సాంఘిక సంక్షేమం, ఎపి సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ హైస్కూల్స్ నుండి పర్యావరణహిత నమూనాలు, ఆరోగ్యం-పరిశుభ్రత, సాఫ్ట్‌వేర్, యాప్‌లు, పర్యావరణ, వాతావరణ మార్పులు, గణిత నమూనా అంశాలపై ప్రతి దాని నుండి ఒక విద్యార్థి, ప్రతి హైస్కూల్ నుండి ఐదు మంది విద్యార్థులు ఐదు నమూనాలను తయారు చేసుకుని హాజరుకావాలని సూచించారు. మండలంలోని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొనాలని ఆమె కోరారు.

జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పులివెందుల జెఎన్‌టియు కళాశాలలో సిఎస్‌సి ద్వితీయ సంవత్సరం చదువుతున్న రవిచంద్ర మోడ్రన్ సింగింగ్ మొదటి స్థానం, జానపద గేయాల్లో రెండవ స్థానం సాధించాడు. కడపలోని కెఎస్‌ఆర్‌ఎం ఇంజనీరింగ్ కాలేజి ఆడిటోరియంలో నిర్వహించిన యువజనోత్సవాల్లో రవిచంద్ర ప్రతిభ చూపాడు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జి.ఎస్.ఎస్.రాజు, వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఆర్.రమణారెడ్డి, సి.ఎస్.ఈ. విభాగాధిపతి డాక్టర్ ఎస్.జెస్సికా సరిత, అధ్యాపక సిబ్బంది విద్యార్థిని అభినందించారు. తమ విద్యార్థి పాల్గొనడానికి అర్హత సాధించాడని హర్షం వ్యక్తం చేశారు.

వేలంపాట నిర్వహిస్తున్న డిఎస్‌పి కేశప్ప

వేలం పాటలో రూ.5.97 లక్షల ఆదాయం

బి.కొత్తకోట : వాహనాల వేలంపాటలో ప్రభుత్వానికి రూ.5,97699 లు ఆదాయం వచ్చినట్లు ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. ఎస్‌పి హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు మదనపల్లి డిఎస్‌పి కేశప్ప , సిఐ శివాంజనేయులు పర్యవేక్షణలో వివిధ కేసులో పట్టుబడిన 15 వాహనాలను శనివారం ఉదయం 12 గంటలకు పోలీస్ స్టేషన్‌ప్రాంగణంలో వేలంపాటను నిర్వహించినట్లుఎస్.ఐ.రామ్మోహన్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ13 ద్విచక్రవాహనాలు, ఒకకారు, ఆటోకు వేలంపాట నిర్వహించినట్లు తెలిపారు. వాహన వేలం పాటలో 5,97,699 రూపాయలు ప్రభుత్వానికి ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ రవీంద్రనాయక్, నాగరాజుగౌడ్, కాని స్టేబుల్ నాగేంద్ర, నరసింహులు, లక్ష్మీనారాయణ, వెంకటరమణ, కావ్య, అంబ్రిష్ పోలీసులు పాల్గొన్నారు.

సిబిఐటి విద్యార్థుల ప్రతిభ

చాపాడు :జెఎన్‌టియు అనంతపురం వారు విడుదల చేసిన ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరం రెండవ సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో స్థానిక సిబిఐటి కళాశాలకు విద్యార్థులు మంచి ప్రతిభ కనబరచి ఉత్తమ ఫలితాలు సాధించారు. ఇందులో సి.యస్.ఇ.విభాగానికి పి.గౌతమి 91.98 శాతం, యస్.సలీం 90.83, యం.పద్మావతి 89.28, ఇ.సి.ఇ.విభాగానికి చెందిన కె.దివ్యాంజలి 85.81, యన్.సుష్మ 85.48, యం.శ్రీవాణి 85.05, ఇ.ఇ.ఇ.విభాగానికి చెందిన డి.శ్రీవల్లి, సుష్మిత 86.88శాతం, పి.సాయి దీపక్ 86.56, ఎ.పెంచలయ్య 86.56, సివిల్ విభాగానికి చెందిన యం.నవనీశ్వర్‌రెడ్డి 85.83, జి. రేవతి 84.30, సి.సూర్య నారాయణ 83.65శాతం మార్కులు సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించారని కళాశాల కరెస్పాండంట్ డాక్టర్ వి.జయచంద్రారెడ్డి, డైరెక్టర్ వి.లోహిత్‌రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాసులరెడ్డి అధ్యాపక, అధ్యాపకేతర బృందం హర్షం వ్యక్తం చేశారు.

పంట పొలాల్లో నీటిని తొలగించుకోవాలి

ప్రజాశక్తి - చాపాడు

తుపాను తాకిడికి వరి పంట పొలాల్లో నీరు అధికంగా చేరుతుందని, వర్షం తగ్గగానే అధిక నీటిని రైతులు బయటకు పంపే ఏర్పాట్లు చేసుకోవాలని వ్యవసాయ అధికారి మ్యాగీ తెలిపారు. తుపాను తీవ్రత తగ్గే వరకు వరి పంట నూర్పిడి పనులు విరమించుకోవాలన్నారు. నేలకొరుగుతుందన్నారు. రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

క్రైం కార్నర్

ఆశా కార్యకర్త ఆత్మహత్య

ప్రజాశక్తి- ములకలచెరువు

మండలంలోని రాపూరివారిపల్లి పంచాయతీ జంగం రెడ్డిగారిపల్లెకు చెందిన ఆశా వర్కర్ శోభ ఇంటిలో ఎవరూ లేనిసమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మ హత్య చేసుకున్నట్లు గ్రామస్థులు , కుటుంబీకులు తెలిపారు. కుటుంబ సభ్యుల కథనం వివరాలిలాఉన్నాయి. గండికోట శంకర భార్య శోభ 30 , రాపూరివారి పల్లె పంచాయతీలో ఆశావర్కర్‌గా పనిచేస్తోందని తెలిపారు .శుక్రవారం ఆరోగ్య కేంద్రానికి విధుల నిమిత్తం వెళ్లిన ఆమె సాయంకాలం ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని మృతి చెందినట్లు తెలిపారు. ఈ విషయంపై స్థానిక ఎస్ఐ మధురామచంద్రుడుకు వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

కుంటలో పడి యువకుడు మృతి

ప్రజాశక్తి - బి.కొత్తకోట

కుంటలో పడి మృతి చెందిన అలీఅహ్మద్

మేకలచెరువు కుంటలో పడి యువకుడు మృతి చెందిన సంఘటన బి.కొత్తకోట మండలంలో చోటు చేసు కుంది. మృతుడు అలీ అహ్మద్ సోదరుడు షేక్ మౌలా పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు. మండలంలోని గట్టు పంచాయతీ బిసి కాలనీకి చెందిన షేక్ కాండ్లమడుగు బాషాసాబ్‌కు ముగ్గురు సంతానమని తాను, తన తమ్ముడు అలీఅహ్మద్, చెల్లెలు ఉందని తెలిపారు. తాను కార్పెంటరుగాను, తన తమ్ముడు వెల్డింగ్ పని చేస్తూ జీవనం సాగిస్తున్నామని చెప్పారు. తన తమ్ముడికి మూర్ఛ వ్యాధి ఉందని, ఈనెల 8వ తేది గురువారం రాత్రి 7 గంటల ప్రాంతంలో ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదన్నారు. బంధువులు,స్నేహితుల ఇళ్లలో వెతికినా ఆచూకీ తెలియలేదని చెప్పారు. ఇదిలా ఉండగా మా గ్రామానికే చెందిన మహమ్మద్ శనివారం ఉదయం 11 గంటలకు తనకు ఫోన్ చేసి మీ తమ్ముడు మేకల చెరువు కుంటలో పడి మృతిచెందాడనే విషయాన్ని తెలిపాడన్నారు. దీంతో తామంతా చెరువు కుంట వద్దకు చేరుకొని తన తమ్ముడి అలీ అహ్మద్ మృతదేహాన్ని బయటకు తీసినట్లు చెప్పారు. తన తమ్ముడు ఐదు సంవత్సరాల నుండి మూర్ఛ వ్యాధితో బాధపడుతున్నాడని, కాలకృత్యాలు తీర్చుకోవడానికి చెరువు వద్దకు వెళ్లి అందులో పడి మృతిచెంది ఉంటాడని అనుమానం వ్యక్తం చేశాడు. ఈ ఘటనపై విచారణ జరపాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ సంఘటనపై మృతుడి సోదరుడు మౌలా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని బి.కొత్తకోట ఎస్.ఐ రామ్మోహన్ వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో బోల్తా పడ్డ ఇన్నోవా వాహనం

వేర్వేరు రోడ్డు ప్రమాదాలు

ప్రయాణికులకు తప్పిన ప్రాణాపాయం

ప్రజాశక్తి-వాల్మీకిపురం

పట్టణం పొలిమేరలో శనివారం జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో మూడువాహనాలు ధ్వంసమయ్యాయి. డ్రైవర్లు చాకచక్యంగా వ్యవహరించడంతో ప్రయాణికులకు పెనుప్రమాదం తప్పింది. మదనపల్లి నుంచి పీలేరు వైపు వెళ్తున్న ఇన్నోవా వాహనం స్థానిక కొత్త సబ్‌జైళ్లు వద్ద బోల్తాపడింది. తిరుపతి నుంచి మదనపల్లి వైపు వెళ్తున్న రెండు కార్లు, ఒక బస్సు ఢీకొన్నాయి. దీంతో వాహనాలు దెబ్బతిన్నాయి. అందులోని ప్రయాణికులకు ఏ ప్రమాదం జరగకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఎస్ఐ బిందుమాధవి సంఘటనాస్థలానికి చేరుకొని, ప్రమాద ఘటనపై ఆరా తీశారు.వర్షం కారణంగా ప్రమాదాలు జరుగు తున్నాయని ప్రయాణికులు జాగ్రత్త చర్యలు పాటించాలని సూచించారు.

నాటు సారా ఊట ధ్వంసం

ప్రజాశక్తి -ములకలచెరువు

మండలంలో 500 లీటర్ల నాటుసార ఉటను ధ్వంసం చేసినట్లు ములకలచెరువు ఎస్ఇబి సిఐ మల్లిక తెలిపారు. సిఐ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మొలకలచెరువు ఎస్ఇబి కార్యాలయం పరిధిలోని పెద్దమండ్యం మండలం దేవేనాయక్‌తాండ సమీపంలో సిఐ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సుమారు 500 లీటర్లు సారా ఊటను ధ్వంసం చేసినట్లు సిఐ పేర్కొన్నారు. దాడుల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.